తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
కరీంనగర్ - నిజామాబాద్
రాజన్న సిరిసిల్ల కామారెడ్డి
పెద్దపల్లి | జగిత్యాల
బుధవారం
07 అక్టోబర్ 2026
పేజీలు : 8

# ఆదర్శ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలి

## కలెక్టర్ కోయ శ్రీహర్ష

- మరమ్మతు పనులను వెంటనే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలి
- విద్యార్థులు క్రీడల్లో పాల్గొనేలా గ్రౌండ్ లెవెలింగ్ పనులు పూర్తి చేయాలి
- పాఠశాల ఆవరణలో పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి
- అమ్మ ఆదర్శ పాఠశాల గ్రాంట్ ద్వారా అవసరమైన నిధులు అందిస్తాం
- గర్రెపల్లి తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ కోయ శ్రీహర్ష



**సుల్తానాబాద్,అక్టోబర్ 06(జనంసాక్షి) :** ఆదర్శ పాఠశాలల్లో అన్ని రకాల మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తెలిపారు. సుల్తానాబాద్ మండలంలోని గర్రెపల్లి తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలను జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు, హాస్టల్ సౌకర్యాలు, విద్యుత్ వ్యవస్థ, పాఠశాల పరిసరాలు, క్రీడా మైదానం తదితర అంశాలను పరిశీలించారు.జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల మౌలిక వసతులు అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాల, బాలికల హాస్టల్లో అవసరమైన మరమ్మతు పనులను గుర్తించి వెంటనే చేపట్టాలని ఆదేశించారు. బాలికల హాస్టల్లో కొన్ని గదులకు తలుపులు సరిగా లేవని, పాఠశాలలో విద్యుత్ వైరింగ్‌కు సంబంధించిన సమస్యలు ఉన్నాయని, వీటితో పాటు ఇతర మరమ్మతు పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన మరమ్మతు పనులకు అమ్మ ఆదర్శ పాఠశాల గ్రాంట్ కింద నిధులను వెంటనే అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– విద్యార్థులకు క్రీడా వసతులు మెరుగుపరచాలి : విద్యార్థులు క్రీడల్లో చురుకుగా పాల్గొనేలా పాఠశాల క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. మైదానంలో అవసరమైన గ్రౌండ్ లెవెలింగ్ పనులను పూర్తి చేసి, విద్యార్థులు క్రీడలు ఆడేందుకు అనుకూలమైన వాతావరణాన్ని కల్పించాలని ఆదేశించారు.

– పరిశుభ్రతకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలి : పాఠశాల ఆవరణలో పిచ్చి మొక్కలు లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రపరిచేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు పరిశుభ్రమైన, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా పాఠశాల పరిసరాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.పాఠశాల, బాలిక హాస్టల్‌లో విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులపై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ, గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గత విద్యా సంవత్సరంలో పదవతరగతిలో 100% ఫలితాలు సాధించడంతో పాటు ఇంటర్మీడియట్ ఫలితాలు జిల్లా స్థాయిలో మెరుగైన ఫలితాలు సాధించినందుకు ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులను మరియు విద్యార్థులను అభినందించారు ఈ పర్యటనలో తెలంగాణ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ గోల్డీ బల్బీర్ కౌర్, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# దసరా నాటికి డబుల్ బెడ్ రూం ఇళ్ల పనులు పూర్తి చేయాలి

## రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి

**గోదావరిఖని, జనంసాక్షి :** దసరా పండుగ నాటికి గృహ ప్రవేశాలు జరిగడానికి వీలుగా అన్ని పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి ఆదేశాలు జారీ చేశారు.మంగళవారం 2వ డివిజన్ జంగాలపల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఆయన సందర్శించారు.డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు మౌళిక వసతులు కల్పించడానికి ఆర్ అండ్ బి శాఖ చేపడుతున్న రోడ్లు, విద్యుత్ సరఫరా, నీటి సరఫరా పైప్‌లైన్ నిర్మాణ పనుల పురోగతిని ఆయన పరిశీలించారు.పనుల్లో వేగం పెంచి త్వరగా పూర్తి చేయాలని అన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్లు వెంగళబాపు, దాసరి సాంబమూర్తి, బాలసాని తిరుపతి,డేవిడ్‌రాజు, ఆర్ అండ్ బి శాఖ డిఇఇ రషీద్ , ఎఇ జావీద్, లబ్దిదారులు పాల్గొన్నారు.అనంతరం రామగుండం 25వ డివిజన్‌లో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనుల పురోగతిని కూడా పరిశీలిశీచారు,స్థానిక కార్పొరేటర్ సిరిశెట్టి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణ లోపాలతో పెరుగుతున్న ప్రమాదాలు



- డీ765 రహదారి పనులు నత్తనడక.. ప్రమాదాలకు అడ్డుకట్టేదెప్పుడు?
- రూ.895 కోట్లతో 96 కిలోమీటర్ల విస్తరణ.. మూడేళ్లు గడిచినా పూర్తికాని పనులు

వార్తా మెయిన్ పేజీలో



# సదాలక్ష్మి రైస్ మిల్లులో షార్ట్ సర్క్యూట్

- దాదాపు 20 లక్షల నష్టం
- రైస్ మిల్లు యజమాని పరిపాటి తిరుపతిరెడ్డి

వార్తా లోపలి పేజీలో

# మూడవసారి ముచ్చటగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గా కొమురవెల్లి భాస్కర్ ఎన్నిక

వార్తా లోపలి పేజీలో

# నాగుల సత్యం గౌడ్‌కు 'భారత్ గౌరవ్' పురస్కారం



**హుజూరాబాద్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** హుజూరాబాద్ పట్టణానికి చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త, ప్రజాకవి నాగుల సత్యంగౌడ్ కు అంతర్జాతీయ స్థాయిలో అరుదైన సముచిత గౌరవం లభించింది. సామాజిక, ఆధ్యాత్మిక సేవలను గుర్తిస్తూ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ సంస్థ 'వండర్ ఇండియా రికార్డ్స్' తమ అధికారిక రికార్డుల పుస్తకంలో చోటు కల్పించడంతో పాటు అత్యున్నత 'భారత్ గౌరవ్ పురస్కార్'తో సత్యంగౌడ్ను ఘనంగా సత్కరించింది. హైదరాబాద్ లోని లక్డీకాపూల్ రవీంద్రభారతి మెయిన్ హాల్ వేదికగా గాంధీ జయంతి, దసరా ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వైభవ సభలో సత్యంగౌడ్ను భారత్ వరల్డ్ రికార్డ్, ఏబీసీడీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు కదరి వెంకట రమణరావు సమక్షం లో ప్రముఖుల చేతుల మీదుగా సత్యం గౌడ్ను పట్టు శాలువాతో ఘనంగా సన్మానించి ఈ పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..రచనలు, ఉపన్యాసాల ద్వారా సమాజంలో మానవీయ విలువలు, ఆధ్యాత్మిక జ్ఞానాన్ని పంచుతున్న సత్యం గౌడ్ సేవలు వెలకట్ట లేనివని ప్రశంసించారు. ఆయన నిస్వార్థ సమాజ సేవ నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో వినియోగదారుల ఫోరం చైర్మన్ మందడి కృష్ణారెడ్డి, సరస్వతీ ఉపాసకులు దైవజ్ఞశర్మ, సీపీ ప్రతినిధి బొగ్గారపు భాగ్యలక్ష్మి, ప్రధాన నృత్య గురువులు పి.రంగనాయకి, వినయ్ రాథోడ్, అసలం, ఆదర్శ ఫౌండేషన్ నిర్వాహకులు కుసుమ భోగరాజు, తోట వందన, పల్లి శిరీష, కీర్తనలతో పాటు పలువురు రచయితలు, కళాకారులు, సామాజికవేత్తలు పాల్గొన్నారు.



## అంగన్వాడీ టీచర్లకు సన్మానం

**హుజూరాబాద్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :** దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని సేవా సంకల్ప్ అభియాన్ లో భాగంగా మంగళవారం హుజూరాబాద్ లో బీజేపీ నాయకులు అంగన్ మిలన్ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని 4వ వార్డు 29వ అంగన్వాడీ సెంటర్ లో వార్డు ఇంచార్జ్ అంకతి శ్రీనివాస్ ఆధ్వర్యంలో అంగన్వాడీ టీచర్ జయ, ఆయా ఇనుగాల అరుణ, ఆశా వర్కర్ శశికళను సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా అంకతి శ్రీనివాస్ మాట్లాడుతూ... ప్రధానమంత్రి నరేంద్రమోదీ 25 సంవత్సరాల సుపరిపాలనలో భాగంగా సేవా సంకల్ప్ కార్యక్రమం నిర్వహి వాంచినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో అహర్నిశలు శ్రమిస్తూ, పిల్లల పోషకాహారం, మాతాశిశు సంరక్షణ కోసం పాటుపడుతున్న అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, ఆశా వర్కర్ల సేవలను గుర్తించి సన్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు తూర్పాటి రాజు, మహిళా మోర్చా అధ్యక్షురాలు, పదో వార్డు కౌన్సిలర్ కొలుగూరి సుమలత, అంకతి రత్నమ్మ, బూత్ ప్రెసిడెంట్ బెజ్జంకి రాజేందర్, యాట రాజేష్ ఖన్నా, సీనియర్ నాయకులు నరాల రాజశేఖర్, ఇల్లందుల ప్రణీత్, పడాల కొమురయ్య, కుసుమ సమ్మయ్య, పిట్టల విజయ్, పడారి సుమన్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ రాష్ట్ర సగర సంఘంలో రాష్ట్ర మహిళా కార్యవర్గంలో

## వీణవంక మండల మహిళలకు చోటు

**వీణవంక అక్టోబర్ 6 (జనంసాక్షి)** వీణవంక తెలంగాణ రాష్ట్ర సగర సంఘం రాష్ట్ర మహిళా కార్యవర్గంలో జిల్లావాసులకు చోటు లభించింది. రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా వీణవంక మండలంలోని కొత్తపల్లికి గ్రామానికి చెందిన బొడిపెల్లి లావణ్యకోటేష్, కార్యవర్గ సభ్యురాలిగా శ్రీరాములపేట గ్రామానికి చెందిన కుర్మిండ్ల జ్యోతి మల్లయ్య సగరలకు చోటు లభించింది.ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎంపీ,మాజీ మంత్రి ఈటల రాజేందర్ కమిటీ సభ్యులను అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా లావణ్య,జ్యోతి మాట్లాడుతూ సగర సంఘం అభివృద్ధికి తాము కృషి చేస్తామని తెలిపారు.తమకు సహకరించి బాధ్యతలను అప్పగించినందుకు రాష్ట్ర,జిల్లా కమిటీ,నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.సగర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సద్దుల బతుకమ్మ ఉత్సవాలను ఘనంగా నిర్వహించాలని మహిళలను కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర,ప్రధాన కార్యదర్శి గౌరక్క సత్యం సగర,గౌరవ అధ్యక్షుడు ముత్యాల హరికిషన్ సగర,రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెద్దబుద్దుల సతీష్ సగర,కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు దేవునూరి శ్రీనివాస్ సగర,మాజీ అధ్యక్షుడు ఏరుకొండ ప్రసాద్ సగర,సగర సంఘ కులస్తులు బొడిపెల్లి కోటేష్ సగర,బొడిపెల్లి విష్ణు సగర,తోపాటు సగర కులస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు

### పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు



**చిగురుమామిడి అక్టోబర్ 06 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం చిన్నముల్కనూర్ గ్రామంలో మంగళవారం ఒక విషాద సంఘటన చోటుచేసుకుంది.గ్రామానికి చెందిన కత్తెరమల్ల రమేష్ అనే యువకుడు గ్రామంలో విద్యుత్ బల్బులు వేస్తుండగా,ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు,కుటుంబ సభ్యులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.ఈ ప్రమాద సమాచారం తెలుసుకున్న హుస్నాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అందె సురేష్,సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మార్క రాజ్‌కుమార్ గౌడ్,డీసీసీ జిల్లా కార్యదర్శి సాంబారి బాబు, ముల్కనూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు పూదరి వేణుగోపాల్ గౌడ్‌లు హుటాహుటిన కరీంనగర్ ఆసుపత్రికి చేరుకున్నారు.అక్కడ చికిత్స పొందుతున్న బాధితుడు రమేష్‌ను పరామర్శించి,ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. అనంతరం అక్కడి వైద్యులతో మాట్లాడి రమేష్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు.రమేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో,మెరుగైన వైద్యం కోసం అతడిని హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రి లేదా నిమ్స్‌కు తరలించేలా నాయకులు తగిన చర్యలు చేపట్టారు.

## లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం

**కథలాపూర్ అక్టోబర్ 6 (జనంసాక్షి)** కథలాపూర్ మండలంలోని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో తాండ్రాల గ్రామంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించడం జరిగింది ఈ వైద్య శిబిరంలో 30 మందికి పరీక్షలు చేయగా 22 మంది కంటి ఆపరేషన్ కు సెలెక్ట్ అయ్యారు ఈ కార్యక్రమంలో లయన్స్ మెంబర్స్ అధ్యక్షులు జవిడి ప్రతాపరెడ్డి తాళ్ల పెల్లి సతీష్ గౌడ్ , పూండ్ర జనార్ధన్ రెడ్డి ముస్కు శ్రీనివాస్ రెడ్డి ఆర్.ఎం.పి అరిసెల్ల గంగరాజనీ సర్పంచ్ జంగా శివాని రంజిత్, ఉప సర్పంచ్ జనార్దన్ రెడ్డి పంచాయతీ కార్యదర్శి కారోబార్ పాల్గొన్నారు.





## 11వ వార్డులో నీటి సమస్యకు పరిష్కారం

**గంభీరావుపేట, అక్టోబర్ 6 (జనం సాక్షి):** గంభీరావుపేట మండలంలోని 11వ వార్డులో నెలకొన్న నీటి సమస్యకు గ్రామపంచాయతీ అధికారులు పరిష్కారం చూపారు. బోరుబావిలో ఉన్న పాత మోటార్ సెట్ చెడిపోవడంతో వార్డులో నీటి సరఫరాకు అంతరాయం ఏర్పడింది. విషయాన్ని వార్డు సభ్యుడు దేవసాని కృష్ణ సర్పంచ్ మల్లుగారి పద్మ నరసయ్యగౌడ్, పంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సర్పంచ్ నూతన మోటార్ సెట్‌ను ఏర్పాటు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో వార్డు ప్రజలు సర్పంచ్, వార్డు సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ మల్లుగారి పద్మ నరసయ్యగౌడ్, వార్డు సభ్యుడు దేవసాని కృష్ణ పాల్గొన్నారు.



# పాత కక్షల నేపథ్యంలో హత్యాయత్నం

### బీరు సీసాతో తల పై కొట్టిన ఇద్దరు వ్యక్తులు అరెస్ట్

**కథలాపూర్ అక్టోబర్ 6 (జనంసాక్షి)** కథలాపూర్ మండలంలోని తాండ్రియాల గ్రామానికి చెందిన షేక్ ఇమ్రాన్, తండ్రి పేరు షేక్ ఇమామ్ అనే వ్యక్తిపై పాత కక్షల నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన సొరపాక నవీన్, తండ్రి నర్సయ్య మరియు కారం రాజు, తండ్రి శంకర్ అనే ఇద్దరు వ్యక్తులు హత్యాయత్నానికి పాల్పడినారు. తేదీ: 05-10-2026 సోమవారం రోజున రాత్రి సుమారు 9:00 గంటల సమయంలో తాండ్రాల గ్రామ శివారులోని చెరువు కట్ట వద్ద నిందితులు మద్యం సేవిస్తూ, షేక్ ఇమ్రాన్‌కు ఫోన్ చేసి అక్కడికి పిలిపించారు. అనంతరం అతనిని చంపాలనే ఉద్దేశంతో బీరు సీసాతో తలపై కొట్టడంతో తలకు తీవ్ర రక్తగాయం అయినదని షేక్ ఇమ్రాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తులో భాగంగా సూరపాక నవీన్ మరియు కారం రాజును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందని, ఈ సందర్భంగా ఎస్సై రవికిరణ్ మాట్లాడుతూ, మండలంలో ఎవరైనా ప్రజాశాంతికి భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే, చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఎమ్మెల్సీగా సిరిసిల్ల నుండి అవకాశం ఇవ్వాలి

**స్వతంత్ర సమరయోధుడి కూతురు**

**తెలంగాణఉద్యమకారిణి, న్యాయవాది**



**సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 6 (జనంసాక్షి)**

సిరిసిల్ల నుండి ఎమ్మెల్సీగా తమకు అవకాశం ఇవ్వాలని, సిరిసిల్ల ముద్దుబిడ్డగా ప్రజాసేవకు అంకితం అవుతానని, సిరిసిల్లకు చెందిన న్యాయవాది జ్యోతి కిరణ్ కోరారు. సిరిసిల్లలోని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్లు తెలిపారు. గత నాలుగు దశాబ్దాలుగా న్యాయవాద వృత్తిలో ప్రజాసేవ చేస్తున్నానని, మొదటినుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన కుటుంబమని, స్వతంత్ర సమరయోధుడు గుడ్ల లక్ష్మీనరసయ్య కూతురుగా గర్వపడుతున్నానని తెలిపారు. సిరిసిల్లకు చెందిన పద్మశాలి ఆడబిడ్డగా తమకు ఎమ్మెల్సీ పదవికి రాజకీయ అవకాశం కల్పిస్తే సిరిసిల్ల ప్రాంతానికి ఉన్నతమైన సేవలు అందిస్తామన్నారు. పట్టణ కాంగ్రెస్ నాయకులు సీనియర్ నాయకులు చొప్పదండి ప్రకాష్ వైద్య శివప్రసాద్ లు మాట్లాడుతూ జ్యోతి కిరణ్ కుటుంబం కాంగ్రెస్ పార్టీకి చెందినదని గుడ్ల లక్ష్మీ నరసయ్య ఎన్నికల్లో నిలబడి ఓడిపోయినా తన జీవితాన్ని పూర్తిగా కాంగ్రెస్ పార్టీకి అంకితం చేశారని, సిరిసిల్లలో మొట్టమొదటిసారిగా కాంగ్రెస్ పార్టీ కార్యాలయం స్థాపించిన వ్యక్తి అని, అలాంటి ఉన్నత కుటుంబంలో జన్మించిన జ్యోతి కిరణ్ ప్రజాసేవ చేయడానికి ముందుకు రావడం అభినందనీయమని అన్నారు. సిరిసిల్ల జిల్లా ప్రజల మద్దతుతో ఎమ్మెల్సీ పదవికి అవకాశం కల్పించాలని కోరారు. ఆమెకు 38 సంవత్సరాల న్యాయవాద వృత్తిపై అనుభవం ఉందని జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి వద్ద జూనియర్ గా పనిచేసి న్యాయవాద వృత్తిలో శిక్షణ పొందారని తెలిపారు. సిరిసిల్ల నుండి ఎమ్మెల్సీ పదవికి అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి ఆకునూరి బాలరాజు, స్వర్గం ప్రసాద్, భీమవరం శ్రీనివాస్, ఛేపూరి శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, దొంత దేవదాస్, మ్యానప్రసాద్, కంసాల మల్లేశం, స్వర్గం ప్రసాద్, గజన్ లాల్ తదితరులు పాల్గొన్నారు.



## సిరిసిల్లలో నవంబర్ 1న జానపద జాతర

### 33 జిల్లాల జానపద కళాకారులతో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలు

**సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 6 (జనం సాక్షి)**

తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ (టి.జి.ఎఫ్.ఐ) ఆధ్వర్యంలో నవంబర్ 1న సిరిసిల్లలో జానపద జాతర నిర్వహించనున్నట్లు సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు పత్తిపాటి రమణాకర్ తెలిపారు.మంగళవారం సిరిసిల్ల పట్టణంలోని షాదీఖానాలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు.తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ఆవిర్భావ వేడుకలను మొట్టమొదటిసారిగా సిరిసిల్లలో ఘనంగా నిర్వహించ నున్నట్లు రమణాకర్ వెల్లడించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని 33 జిల్లాలకు చెందిన జానపద కళాకారులు పాల్గొనేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, జానపద కళలను కాపాడటం తో పాటు కళాకారులకు ప్రత్యేక గుర్తింపు కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీని ఏర్పాటు చేసినట్లు చెప్పారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న జానపద కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి వారి కళలకు ప్రోత్సాహం అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.నవంబర్ 1న నిర్వహించనున్న జానపద జాతరలో వివిధ జిల్లాల కళాకారులు తమ ప్రతిభను ప్రదర్శించ నున్నట్లు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కళాకారులు, నిర్వాహకులు, జానపద కళాభిమానులు సహకరించాలని రమణాకర్ కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ ఫోక్ ఇండస్ట్రీ ప్రతినిధులు, జానపద కళాకారులు ప్రధాన కార్యదర్శి ఎండి సత్తార్, ప్రచార కార్యదర్శి ఆకునూరి దేవయ్య, ఉపాధ్యక్షులు జి.ఎల్.నాందేవ్ కళాంజలి రాజేష్, జడల రమేష్, రేలారే గంగా, నాగలక్ష్మి,శిరీష శ్రీధర్, గజ్వేల్ వేణు, రామచంద్రం, తదితరులు పాల్గొన్నారు.





## మూడవసారి ముచ్చటగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గా కొమురవెల్లి భాస్కర్ ఎన్నిక

**సుల్తానాబాద్,అక్టోబర్ 06(జనంసాక్షి) :**

సుల్తానాబాద్ పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు కొమురవెల్లి భాస్కర్ ఎట్టకేలకు మూడవసారి ముచ్చటగా పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు, స్థానిక,వైశ్య భవన్ లో ఎన్నికలు నిర్వహించగా, గౌరవ అధ్యక్షులు గా కొమురవెల్లి రామ్మూర్తి ,సెక్రటరీ గా పుల్లూరి రమేష్,క్యాషియర్ గా కొమురవెల్లి (కెబి) శ్రీనివాస్,శ్రీ వాసవి మాత దేవాలయం చైర్మన్ గా చకిలం మారుతి, సెక్రటరీగా నార్ల శ్రీనివాస్,పట్టణ ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలి గా పల్ల అపర్ణ ను ఏకగ్రీవంగా సభ్యులందరూ కలిసి ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా కార్యదర్శి అల్లంకి లింగమూర్తి వ్యవహరించారు.ఈ నూతన కమిటీ ల నియామకం పట్ల ఆర్యవైశ్య సంఘం నాయకులు,సభ్యులు సంతోషం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.



## మట్టి రోడ్డు వేయాలని రిలే నిరాహార దీక్షలు

**గంభీరావుపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి):**

లింగన్నపేట?గంభీరావుపేట గ్రామాల మధ్య మానేరు వాగుపై తాత్కాలికంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ గ్రామ సేవా కమిటీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. కమిటీ అధ్యక్షుడు సిరిపురం రవి ఆధ్వర్యంలో సభ్యులు శాంతియుతంగా దీక్షలో పాల్గొన్నారు. మానేరు వాగు ఉధృతికి తాత్కాలిక మట్టి రోడ్డు కొట్టుకుపోయి రెండు నెలలు గడిచినా రాకపోకలు పునరుద్ధరించలేదని వారు తెలిపారు. దీంతో గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల ప్రజలు, విద్యార్థులు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. సమస్య పరిష్కారం కోసం ఆర్అండ్బీ, జిల్లా స్థాయి అధికారులకు పలుమార్లు విన్నవించినా స్పందన లేదన్నారు.మానేరు వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు నాలుగేళ్లుగా నత్తనడకన సాగుతున్నాయని, అధికారులు ప్రత్యేక దృష్టి సారించి పనులను త్వరగా పూర్తి చేయాలని కోరారు. అప్పటివరకు ప్రజల రవాణా సౌకర్యం కోసం తాత్కాలికంగా మట్టి రోడ్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో రాచర్ల పార్థసారథి శర్మ, జెల్ల భూదయ్య, చేపూరి ప్రభాకర్, రాగిశెట్టి నారాయణ, ఇరిగి పరశురాములు, దోసల ఉపేందర్, దోసల చంద్రం, బార ధనరాజ్, గూడెపు రవి, మజార్ తదితరులు పాల్గొన్నారు.

## చేపల వేటకు వెళ్లి వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి



**గంభీరావుపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి):**

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన ఘటన గంభీరావుపేట మండలంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లుపల్లి గ్రామానికి చెందిన కొమ్ము స్వామి (35), కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. చేపల వేటకు వెళ్లి వస్తానని కుటుంబ సభ్యులకు చెప్పి ఈ నెల 5న ఉదయం ఇంటి నుంచి వెళ్లాడు. రాత్రి అయినా ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు గ్రామ శివారులో, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు.ఈ క్రమంలో మంగళవారం ఉదయం నాగంపేట గ్రామానికి చెందిన నర్ర రాజిరెడ్డి తన వ్యవసాయ బావిలో ఓ వ్యక్తి మృతదేహం నీటిపై తేలుతూ ఉందని కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. దీంతో స్వామి సోదరుడు రమేష్, కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకుని మృతదేహం స్వామిదేనని గుర్తించారు. మృతదేహాన్ని బావిలో నుంచి బయటకు తీశారు.చేపల వేటకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు కాలుజారి బావిలో పడి నీటిలో మునిగి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్వామి మృతిపై తమకు ఎవరిపైనా అనుమానం లేదని పేర్కొన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సీహెచ్. శ్రీకాంత్ తెలిపారు.

## అలుగునూర్ - 2 అంగన్వాడి కేంద్రంలో ఘనంగా 'అంగన్ మిలన్ సేవ' - 'అంగన్వాడి ఉత్సవ్'

**ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర**

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 06 (జనంసాక్షి) :**



దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని చేపట్టిన 'సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా మంగళవారం రోజున అలుగునూర్ - 2 అంగన్వాడి కేంద్రంలో నిర్వహించిన 'అంగన్ మిలన్ సేవ' - 'అంగన్వాడి ఉత్సవ్' కార్యక్రమం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి బొంతల కళ్యాణ్ చంద్ర హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా బొంతల కళ్యాణ్ చంద్ర మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల సమగ్ర అభివృద్ధికి, చిన్నారుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం కృషి చేస్తోందన్నారు. పిల్లలకు పౌష్టికాహారం అందించడంలో కేంద్రం అమలు చేస్తున్న పథకాలు ఎంతో ప్రయోజనకరంగా ఉన్నాయని తెలిపారు. చిన్నారుల సంరక్షణలో, అంకితభావంతో సేవలు అందిస్తున్న స్థానిక అంగన్వాడి టీచర్ లతను ఈ వేదికగా ఘనంగా సన్మానించి, వారి సేవలను కొనియాడారు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు, చాక్లెట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పోలింగ్ బూత్ అధ్యక్షులు చిందం అంజి, అంగన్వాడి సిబ్బంది, పిల్లల తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## సదాలక్ష్మి రైస్ మిల్లులో షార్ట్ సర్క్యూట్

**- దాదాపు 20 లక్షల నష్టం**

**- రైస్ మిల్లు యజమాని పరిపాటి తిరుపతిరెడ్డి**



**సుల్తానాబాద్,అక్టోబర్ 06(జనంసాక్షి) :**

మండలంలోని కాట్నపల్లి శివారులోని సదాలక్ష్మి రైస్ మిల్లులో మంగళవారం ఉదయం ఆరు గంటలకు డ్రైయ్యర్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. దీంతో డ్రైయ్యర్ లో ఉన్నటువంటి ధాన్యంమొత్తం పనికిరాకుండా నష్టం వాటిల్లింది.దాదాపు 20 లక్షల ఆస్తి,నష్టం జరిగినట్లు సదాలక్ష్మి రైస్ మిల్ యజమాని పరిపాటి తిరుపతిరెడ్డి తెలిపారు. ఒక్కసారిగా మంటలు రావడంతో, వెంటనే పక్కనున్న లేబర్లోపాటు, యజమాని సహాయక చర్యలకు పూ నుక్కున్నారు. మంటలు పెద్దగా లేవడంతో అప్రమత్తం అయిన రైస్ మిల్ యజమాని తిరుపతిరెడ్డి వెంటనే ఫైర్ ఇంజన్ కు ఫోన్ చేయడంతో, సిబ్బంది సహాయక చర్యలు చేపట్టి మంటలను ఆర్పి వేశారు. సహాయక చర్యల్లో దాదాపు 20 మంది పాల్గొన్నారు.



## నీరటి శంకర్ ఆధ్వర్యంలో కాకా జయంతి సందర్భంగా వృద్ధులకు మానసిక వికలాంగులకు అన్నదానం

**సుల్తానాబాద్,అక్టోబర్ 06(జనంసాక్షి) :**
కాకా 97వ జయంతి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సోమవారం ఐ ఎన్ టి యు సి రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి సీనియర్ కాంగ్రెస్ నేత, నీరటి శంకర్ ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో, వృద్ధులకు బిరియానితో భోజనం పొట్లాలను పంపిణీ చేశారు, అంతేకాకుండా మానసిక వికలాంగుల కేంద్రంలో అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా నీరటి శంకర్ మాట్లాడుతూ కాకా వెంకటస్వామి తన రాజకీయ ప్రస్థానంలో ఎన్నో గొప్ప పదవులను అలంకరించి పదవికే వన్నెతెచ్చిన గొప్ప తెలంగాణ స్వాప్నికుడని కొనియాడారు. పార్లమెంటు సభ్యునిగా, ఏఐసీసీ ప్రతినిధిగా, కేంద్ర కార్మిక శాఖ మంత్రిగా, కాంగ్రెస్ పార్టీలో అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ కే పెద్దదిక్కుగా ఉన్నటువంటి కాక వెంకటస్వామి నిత్యం ప్రజల కోసం కార్మికుల కోసం పరితపిస్తూ, తన సేవా కార్యక్రమాలను చేశారని స్పష్టం చేశారు. కాక ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ పాటుపడాలని సూచించారు. కాక రాజకీయ వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని, తన కుమారుడు వివేక్ వెంకటస్వామి ఎంపీగా మంత్రిగా ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు చేస్తున్నారని కొనియాడారు. కాక మనవడు పెద్దపల్లి పార్లమెంటు సభ్యునిగా గడ్డం వంశీకృష్ణ నిత్యం ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బొల్లం లక్ష్మణ్, రాష్ట్ర ఎస్సీ సెల్ సెక్రెటరీ అరేపల్లి రాహుల్,న్యాతరి శ్రీనివాస్,కనుకుంట్ల శ్రీనివాస్,ధరాడే శ్యామ్,జొన్నాల రవీందర్, దొడ్ల దేవేందర్,గడ్డం సతీష్,చొప్పరి రాజు, తో పాటు తదితరులు పాల్గొన్నారు.




## నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్,సబ్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ లో పతకాలు సాధించిన కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థులు

### - అభినందిన ప్రిన్సిపాల్ సీజ్జు ఎస్ నాయర్

**సుల్తానాబాద్,అక్టోబర్ 06(జనంసాక్షి) :**
ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నిర్వహించిన,నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్,సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలలో,కేరళ మోడల్ హై స్కూల్ విద్యార్థులు, అండర్ -16 బాలబాలికల విభాగంలో, వి. అశ్వద్ బంగారు,రజతం పతకాలు, ఎ వైశాలి బంగారు,రెండు రజతాలు,కాంస్యం , పి. అభిరామ్ రజతం, ఎ.గాయత్రి రజతం, రిషివర్ధన్ కాంస్యం, లిఅండర్ -14 విభాగంలోలి . ట్రైథలాన్ - ఎ, లో కె. శ్రీచరన్ బంగారు, వి.అవంతిక కాంస్య పతకం,ట్రైథలాన్- సి లో జి.చరిత బంగారు పతకం, అండర్ -12 విభాగంలో,ఆదిల్ కృష్ణ ఎస్ నాయర్ బంగారు పతకం, వి. నిహాస్ గౌడ్ రెండు బంగారు పతకాలు,అండర్ -10 విభాగంలో యు. హార్దిక్ బంగారు,రజతం, ఏం. వేదాన్షీ కాంస్య పతకాలు సాధించారు. సబ్ జూనియర్ లో గెలిచినవారు ఈ నెల 11 న ఆసిఫాబాదు లో తెలంగాణ రాష్ట్ర స్థాయిలో, అండర్ 14,16 గెలిచినవారు నవంబర్ 13,14,15 ,16 హైదరాబాదు లో జరిగే నేషనల్ ఇంటర్ డ్రిస్టిక్ అథ్లెటిక్స్ మీట్ లో పాల్గొంటారని,పెద్దపల్లి అథ్లెటిక్స్ డిస్ట్రిక్ట్ సెక్రెటరీ కె. గట్టయ్య తెలిపారు.వీరిని కేరళ మోడల్ హై స్కూల్ ప్రిన్సిపాల్ సీజ్జు ఎస్ నాయర్, వైస్ ప్రిన్సిపాల్ స్మిత ఎస్ నాయర్లి పిటీలు ఏ. అజయ్, డి. రాజు, ఉపాధ్యాయులు అభినందించారు.

## సుందిళ్లలో సింగరేణి ఉచిత మెడికల్ క్యాంప్..

**గోదావరిఖని, జనంసాక్షి :**



సింగరేణి రామగుండం ఏరియా.1 పరిధిలోని సింగరేణి పరిసర ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య సంరక్షణలో భాగంగా సామాజిక బాధ్యత (సియస్ఆర్)లో భాగంగా ఆర్జీ-1 జీఎం డి. డి.లలిత్‌కుమార్ ఆదేశాల మేరకు మంగళవారం సుందిళ్ల గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరానికి ఆర్జీ-1 ఎస్ఓ టు జియం కే.చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా హజరై వైద్య శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్బంగా ముఖ్య అతిథి చంద్రశేఖర్ మాట్లాడుతూ సింగరేణిలో ప్రభావిత గ్రామం సుందిళ్ల గ్రామస్తుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా వైద్య శిబిరాన్ని నిర్వహించామన్నారు.ప్రజల ఆరోగ్య పరిరక్షణ విషయంలో సింగరేణి ఉద్యోగులతో పాటు సింగరేణి పరిసర ప్రభావిత గ్రామాల ప్రజల ఆరోగ్య విషయంలో కూడా ప్రత్యేక శ్రద్ద వహిస్తున్నదని తెలిపారు. వైద్య శిభిరంలో సీజనల్ వ్యాధులకు సంబధించి, బిపి, షుగర్, జ్వరం, జలుబు తదితర జబ్బులను పరీక్షించి 187 మందికి తగిన మందులను ఇచ్చారన్నారు.రానున్న చలికాలం దృష్ట్యా ప్రత్యేకించి అనారోగ్య సమస్యలు, రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తల గురించి హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కారం పద్మ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రములో డాక్టర్ కారం పద్మ, డాక్టర్ రవి, సర్పంచ్ నరేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ సదానందం, పర్యావరణ పరిరక్షణ అధికారి వేణు,అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

## జీఎం కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమం..

**గోదావరిఖని, జనంసాక్షి :**




మహాత్మాగాంధీ జయంతి సందర్భంగా కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మినిస్ట్రీ ఆఫ్ కోల్ ఆదేశాల ప్రకారం సింగరేణి వ్యాప్తంగా అక్టోబర్ 2 నుండి 31 వరకు తలపెట్టిన స్పెషల్ క్యాంపెయిన్ 6.0 - డిస్పోజల్ ఆఫ్ ఈ-వేస్ట్ లో భాగంగా రామగుండం ఏరియా.1 జీఎం కార్యాలయ ప్రాంగణంలో ఎన్విరాన్మెంట్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛత కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సింగరేణి ఆర్జీ-1 ఏరియా జనరల్ మేనేజర్ డి.లలిత్‌కుమార్ పాల్గొని ఉద్యోగులతో కలిసి పనికిరాని,పాడైన, ఎలక్ట్రికల్,ఎలక్ట్రానిక్ పరికరాలను (ఈ-వేస్ట్) సేకరించి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డబ్బాలలో వేశారు.అలాగే జీఎంతో పాటు జీఎం కార్యాలయ ఉద్యోగులు, సిబ్బంది కూడా తమ వద్ద ఉన్న ఈ-వేస్ట్ పరికరాలను సేకరించి ప్రత్యేక డబ్బాలలో వేశారు.ఈ కార్యక్రమంలో యస్ఓ టు జియం కే.చంద్రశేఖర్,ఎజియం (ఐఇడి) ఆంజనేయులు, డిజియం (ఫైనాన్స్) ధనలక్ష్మి భాయి, డిజియం (ఫారెస్ట్) కర్ణ, పర్యావరణ పరిరక్షణ అధికారి వేణు,ఐటి మేనేజర్ రాజేష్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్,అధికారులు,ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## 'ఖని'లో ఆశా వర్కర్స్-డే..

- ప్రజారోగ్యానికి ఆశా కార్యకర్తలు వెన్నెముక..
- బీజేపీ ఓబీసీ మోర్చా ఉపాధ్యక్షురాలు సంధ్యారాణి..

**గోదావరిఖని, జనంసాక్షి :**
ఆశా వర్కర్స్-డే సందర్భంగా సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా రామగుండం నియోజకవర్గంలోని బసంత్‌నగర్ పీహెచ్‌సీ పరిధిలో పనిచేస్తున్న ఆశా కార్యకర్తలను బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు మంగళవారం కందుల సంధ్యారాణి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆశా కార్యకర్తలకు ఆమె హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా కందుల సంధ్యారాణి మాట్లాడుతూ ఆశా కార్యకర్తల సేవలను గుర్తించి గౌరవించుకోవడానికి ప్రత్యేకంగా ఒక రోజు ఉండటం ఎంతో సంతోషకరమైన విషయమన్నారు.క్షేత్రస్థాయిలో ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆశా కార్యకర్తలు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు.డాక్టర్లు, ఏఎన్ఎంలతో పాటు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో ఆశా కార్యకర్తలు కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు.ఎన్నో కుటుంబ,ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు సేవ చేయడాన్ని తమ బాధ్యతగా భావిస్తూ వారు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పెద్దపల్లి జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు చిలుక భారతి, మహిళా మోర్చా జనరల్ సెక్రెటరీ సులువ పద్మ, మహిళా మోర్చా ఉపాధ్యక్షులు చల్ల శోభారాణి, ఎల్తూరి సరిత, కార్యదర్శి పరకాల శ్రీలత, లక్ష్మీనగర్ మండల అధ్యక్షురాలు ఉరగొండ అపర్ణ, యైటింక్లయిన్‌కాలనీ మండల అధ్యక్షురాలు మీనుగు మనోహర,డాక్టర్ సరళ,పరకాల మురళి, జక్కన బాలు, సిలారపు కళ్యాణ్, మీశ వికాస్, వైద్య సిబ్బంది మంజుల, రాజేశ్వరి, సరిత, రజిత, అనసూర్య, సరస్వతి, జమున, మాధవి, సుమలత, పద్మ, రాజకుమారి, లావణ్య, అస్మా, రాజేశ్వరి, వనిత, పుష్ప, లత తదితరులు పాల్గొన్నారు.





## సేవా సంకల్ప్ అభియాన్‌లో అంగన్ మిలాన్ కార్యక్రమం

**సుల్తానాబాద్,అక్టోబర్ 06(జనంసాక్షి)**
:సేవా సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అంగన్ మిలాన్ కార్యక్రమం ద్వారా అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి,అంగన్వాడీ టీచర్లు ఆయాలను ఘనంగా సన్మానించారు.బీజేపీ మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి లత, జిల్లా ఉపాధ్యక్షురాలు కూనరపు రేణుకదేవి, సుల్తానాబాద్ మండల అధ్యక్షురాలు మల్కా భాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు కర్రే సంజీవరెడ్డి మండల బీజేపీ అధ్యక్షులు కందుల శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం దేశ అభివృద్ధి, మహిళా సాధికారత, పేదల సంక్షేమం కోసం చేపడుతున్న పలు కార్యక్రమాలను వివరించారు. మోదీ ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించడంలో సేవా కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు.అంగన్వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు పోషకాహారం, ప్రాథమిక విద్యతో పాటు తల్లులు, చిన్నారుల సంక్షేమానికి అంగన్వాడీ టీచర్లు, ఆయాలు అందిస్తున్న సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. వారి సేవలను గుర్తించి సన్మానించడం తమకు గర్వకారణమని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యదర్శులు కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్ కుమార్,మేకల కార్తీక్ యాదవ్,ఉషణ్ అన్వేష్,ఎర్రం సంతోష్ రెడ్డి,వారికీల్లా నాగభూషణం, దాసరి చందు, రసూరి ప్రవీణ్,రిషి,తదితరులు పాల్గొన్నారు.

## మహిళల ఆత్మగౌరవమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం..

### - 38వ డివిజన్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ..

**గోదావరిఖని, జనంసాక్షి :**
రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 38వ డివిజన్ మల్లిఖార్జుననగర్ సీనియర్ సిటిజెన్ హాలువద్ద మంగళవారం డివిజన్ మహిళలకు ఇందిరమ్మ చీరలను కార్పొరేటర్ నెలికంటి రాము పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి మాట్లాడుతూ మహిళలకు సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన, సామాజిక భద్రత కల్పించడమే ప్రజా పాలనలో ముఖ్యమైన లక్ష్యమని పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నాయకత్వంలో మహిళల సంక్షేమం,సాధికారతకు ప్రత్యేక ప్రాధాన్యత లభిస్తోందని తెలిపారు.మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం,రూ.500కే గ్యాస్ సిలిండర్ వంటి సౌకర్యాలతో పాటు, గృహజ్యోతి ద్వారా అర్హత కలిగిన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, ఇందిరమ్మ ఇళ్ల ద్వారా మహిళల పేరుతో ఇళ్ల మంజూరు వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.అలాగే మహిళా స్వయం సహాయక సంఘాలను మరింత బలోపేతం చేస్తూ, వారికి బ్యాంకు లింకేజీ, మహిళా శక్తి కార్యక్రమాలు,వ్యాపార, ఉపాధి అవకాశాలను పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. రామగుండం నియోజకవర్గంలో మహిళల సంక్షేమం,అభివృద్ధి కోసం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ నాయకత్వంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి కొనసాగుతుందని కార్పొరేటర్ నెలికంటి రాము తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్పీలు, బీఎల్ఓలు తిరుమల, స్వరూప, సరస్వతి, చిన్ని, వాణి తదితరులతో పాటు అధిక సంఖ్యలో డివిజన్ మహిళలు పాల్గొన్నారు.



# ఉస్మానియా యూనివర్సిటీ వైపు మాదిగ విద్యార్థుల పయనం

## జాతీయ మహాసభల విజయవంతమే లక్ష్యం

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 06 జనంసాక్షి:** మాదిగ రిజర్వేషన్ పోరాటం సమితి వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు నిజామాబాద్ నుండి కదిలిన విద్యార్థి లోకం. మంద కృష్ణ మాదిగ ఇచ్చిన పిలుపు మేరకు, నిజామాబాద్ జిల్లా నుంచి ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్ వేదికగా జరగనున్న మాదిగ విద్యార్థుల జాతీయ మహాసభలకు భారీ సంఖ్యలో విద్యార్థులు మంగళవారం బయలుదేరి వెళ్లారు. చదువుతో పాటు హక్కుల సాధన కోసం విద్యార్థులను ఏక తాటి పైకి తీసుకువచ్చే ఉద్దేశంతో ఈ జాతీయ మహాసభలను అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నారు. ఈ మహాసభల ద్వారా విద్యా సంస్థల్లో మాదిగ విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, రిజర్వేషన్ల అమలు తీరు, మరియు భవిష్యత్ రాజకీయ-సామాజిక హక్కుల పరిరక్షణపై తీవ్రమైన చర్చ జరిగి, బలమైన కార్యాచరణ రూపొందించబడే అవకాశం ఉంది. ఈ మహాసభలను విజయవంతం చేయడానికి నిజామాబాద్ ప్రాంతం నుంచి విద్యార్థులు వెళ్లడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి వివిధ స్థాయిల నాయకులు మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గంధముల నాగభూషణం మాదిగ, ఎంఈఎఫ్ జాతీయ కోర్ కమిటీ సభ్యులు ఆర్ నాంపల్లి మాదిగ పాల్గొని విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు. అలాగే, ఎంబీఎఫ్ జాతీయ ఉపాధ్యక్షులు సిరివెళ్ల సురేష్ మాదిగ, ఎన్నీ జాతీయ కోరుకొండ సభ్యులు తెడ్డు గంగారాం మాదిగలు కూడా తమ సంఘీభావాన్ని ప్రకటించారు. క్షేత్రస్థాయిలో విద్యార్థులను సమన్వయం చేస్తూ ముందుకు నడిపించడంలో ఎమ్మార్పీఎస్ జిల్లా సీనియర్ నాయకులు యాదాసీ శ్రీరాములు మాదిగ, మాదిగ విద్యార్థి నాయకుడు రాహుల్ మాదిగ, వివేక్ మాదిగ తదితరులు కీలక పాత్ర పోషించారు.






# ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ జాతీయ సెమినార్ బ్రోచర్ ఆవిష్కరణ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 06 జనంసాక్షి:** కాకతీయ విశ్వవిద్యాలయంలో డిసెంబర్ 27, 28, మరియు 29 (2026) లో జరిగే 109 వ ఇండియన్ ఎకనామిక్ అసోసియేషన్ జాతీయ సెమినార్ బ్రోచర్ ను తెలంగాణ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరి రావు రిజిస్ట్రార్ ఆచార్య యం. యాదగిరి తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైస్ ఛాన్సలర్ ఆచార్య టి. యాదగిరిరావు మాట్లాడుతూ ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వేగంగా జరిగే వర్తమాన మార్పులు,వృద్ధి - అభివృద్ధి సిద్ధాంతాలు మరియు ఆర్థిక సంక్షోభాల నివారణ మార్గాలను ఈ సెమినార్ లో చర్చిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్స్ డిపార్ట్మెంట్ ప్రొఫెసర్ కె. రవీందర్ రెడ్డి, డాక్టర్ నాగరాజు పాత, డాక్టర్ ఏ. పున్నయ్య, డాక్టర్ టి. సంపత్, డాక్టర్ సిహెచ్ శ్రీనివాస్, డాక్టర్ దత్త హరి లు పాల్గొన్నారు.



# సింగరేణి ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఆవరణలో టీబీజీకేఎస్ ధర్నా..

### - టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి..

**గోదావరిఖని, జనంసాక్షి :** ప్రాణాలు ఫణంగా పెట్టి సింగరేణి కార్మికులు పనిచేస్తున్నారని, గత సంవత్సరం సాధించిన లాభాల వివరాలను తక్షణమే వెల్లడించ కుంటే ప్రజాభవన్‌ను ముట్టడిస్తామని జియం ఆఫీస్ ఆవరణలో ఎస్ఓ టు జిఎంకు వినతిపత్రాన్ని మంగళవారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీబీజీకేఎస్ అధ్యక్షులు మిర్యాల రాజిరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కార్మికులను ద్దేశించి మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం ముగిసి ఆరు నెలలు గడిచిందని, ఇప్పటివరకు గత సంవత్సరం లెక్కలు చెప్పకపోవడం సింగరేణి యాజమాన్యం,రాష్ట్ర ప్రభుత్వం దివాలా కోరు విధానాలకు నిదర్శనమని పేర్కొన్నారు. దసరా పండుగలోపు లాభాల వాటాను చెల్లించడం సాంప్రదాయంగా కొనసాగుతున్నదని పేర్కొన్నారు. మరో పక్షం రోజులలో దసరా పండుగ ఉన్నందున తక్షణమే సింగరేణి సంస్థ సాధించిన లాభాలను ప్రకటించి, 36శాతం లాభాల వాటాను కార్మికులకు పంచాలని వారు డిమాండ్ చేశారు. సింగరేణి కార్మికుల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యేలు,మంత్రులు చొరవ చూపి ముఖ్యమంత్రితో సంప్రదించాలని,గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలుగా చెప్పుకునే నాయకులు ఉదాసీన వైఖరి అవలంబిస్తున్నారని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమాలలో టీబీజీకేఎస్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ఆర్‌జీ-1 ఇంచార్జ్ నూనె కొమరయ్య, కోశాధికారి చెల్పూరి సతీష్, పోలాడి శ్రీనివాసరావు, ఇందూరు సత్యనారాయణ, మొదుంపల్లి రాజేశం, చిలకలపల్లి శ్రీనివాస్, కొండ్ర అంజయ్య,దూత శేషగిరి, జనగామ మల్లేష్, వాసర్ల జోసెఫ్,ఉప్పులేటి తిరుపతి, పల్లె సురేందర్, అడ్డగట్ల గోపి, పుప్పల రవీందర్, రాజకుమార్, అప్సర్‌పాషా, పుల్కాక శంకర్, మాసాడి సాయి,చరణ్, అబ్దుల్ రెహమాన్, అధిక సంఖ్యలో అన్ని గనుల టీబీజీకేఎస్ శ్రేణులు, కార్మికులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ముందస్తు అరెస్టు

**భీంగల్ అక్టోబర్ 06 జనంసాక్షి:** భీంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన పొలాస సుధాకర్ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందిన నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. సుమారు 90 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతున్న సుధాకర్ మృతి చెందడంతో ఆయనకు



నివాళులర్పించేందుకు బయలుదేరిన మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసినట్లు సమాచారం. భీంగల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పొలాస సుధాకర్ ఒంటిపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రంగా గాయపడిన ఆయనను తొలుత ఆర్మూర్ ఆసుపత్రికి, అనంతరం మెరుగైన చికిత్స కోసం తరలించారు. ఘటనకు పోలీసుల వేధింపులే కారణమని సుధాకర్ కుటుంబ సభ్యులు ఆరోపించారు. అయితే పోలీసుల వైపు తప్పిదం లేదని నిజామాబాద్ సీపీ పేర్కొన్నట్లు వార్తా కథనాలు వెల్లడించాయి. సుధాకర్ ఆత్మహత్యాయత్నం అనంతరం మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి స్పందిస్తూ ఎస్సై తిరుపతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధితుడికి మెరుగైన వైద్యం అందించాలని కోరడంతో పాటు, భీంగల్ బంద్‌కు కూడా పిలుపునిచ్చారు. సుధాకర్ మృతి నేపథ్యంలో ఆయన కుటుంబాన్ని పరామర్శించి, మృతదేహానికి నివాళులర్పించేందుకు వెళ్తున్న వేముల ప్రశాంత్‌రెడ్డిని పోలీసులు ముందస్తుగా అరెస్టు చేయడం స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

# రోడ్డు భద్రతపై డ్రైవర్లకు శిక్షణ

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 06 జనంసాక్షి:** టీజీఎస్ఆర్టీసీ నిజామాబాద్ డ్రైవర్లకు రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణ, ఇంధన పొదుపు, ఆరోగ్య పరిరక్షణపై శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్టీసీ రీజినల్ మేనేజర్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి నిజామాబాద్ ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ ముఖ్య అతిథిగా హాజరై డ్రైవర్లకు రోడ్డు భద్రతపై పలు సూచనలు చేశారు. అలాగే ఇంపాక్ట్ ఫౌండేషన్కు చెందిన డా. ప్రవీణ్ కుమార్ డ్రైవర్లకు ఏకాగ్రత, మానసిక ప్రశాంతత, ఆరోగ్య పరిరక్షణ, డ్రైవింగ్ సమయంలో అప్రమత్తత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ "డ్రైవర్ అప్రమత్తతే ప్రయాణికుల భద్రతకు ప్రధాన రక్షణ" అని పేర్కొన్నారు. డ్రైవింగ్ సమయంలో సెల్ఫోన్ వినియోగించకూడదని, మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. తగిన విశ్రాంతి తీసుకుని, ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధులు నిర్వహించాలని తెలిపారు. అలాగే డ్రైవర్లకు ప్రాక్టికల్ శిక్షణ తరగతులు నిర్వహించి, ప్రమాదకర పరిస్థితులను ముందుగానే గుర్తించడం, బ్రేకింగ్ పై నియంత్రణ, వాహనాన్ని సురక్షితంగా నడపడం, ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలను వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను కచ్చితంగా పాటిస్తూ డ్రైవర్లు విధులు నిర్వహిస్తే ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడంతో పాటు ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని అధికారులు తెలిపారు.



# శ్రమ ఒక్కటే..హక్కులు వేరు..

### - కాంట్రాక్టు కార్మికుల పట్ల వివక్షత..
### - శ్రమ దోపిడీతో లాభాలు పొందుతున్న సింగరేణి..
### - ఆర్‌జీ-1 జీఎం కార్యాలయ ఆవరణలో ధర్నా..




**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో ఆర్‌జీ-వన్ జీఎం కార్యాలయం ముందు మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ధర్నాలో పాల్గొన్న సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వెంకన్న మాట్లాడుతూ సింగరేణి యజమాన్యం 2025-2026 సంవత్సరానికి సంబంధించిన లాభాలను ఆరు నెలలు గడిచిపోయినప్పటికి ప్రకటించలేదన్నారు. ఇప్పటికైనా సింగరేణి యజమాన్యం సంస్థకు వచ్చిన లాభాలను వాస్తవ లాభాలను ప్రకటించాలన్నారు. సింగరేణి సంస్థలో పర్మినెంట్ కార్మికులతో సమానంగా కాంట్రాక్ట్ కార్మికులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. సింగరేణిలో 42,000 మంది పర్మినెంట్ కార్మికులు ఉన్నారని,సుమారు 35,000 మంది కాంట్రాక్ట్ కార్మికులు పనిచేస్తున్నారని గుర్తు చేశారు. సింగరేణి యజమాన్యానికి వచ్చే లాభాలలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ, చెమట చుక్కలు ఉన్నాయన్నారు. సింగరేణికి వస్తున్న వార్షిక లాభాలలో కాంట్రాక్ట్ కార్మికుల శ్రమ దోపిడీ దాగి ఉన్నదని,అతితక్కువ వేతనాలు ఇవ్వడం మూలంగానే సింగరేణికి లాభాలు వస్తున్నాయన్నారు. కాంట్రాక్ట్ కార్మికులు పర్మినెంట్ కార్మికుల శ్రమ ఒక్కటే అయినప్పటికీ హక్కులు మాత్రం వేరుగా అమలు చేస్తూ సింగరేణి యాజమాన్యం కాంట్రాక్టు కార్మికుల పట్ల సవతి తల్లి ప్రేమను ప్రదర్శిస్తున్నదన్నారు. సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు 2025-2026 ఆర్థిక సంవత్సరంలో వచ్చే లాభాలలో 10శాతం వాటాను కేటాయించాలని సింగరేణి యజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో ఐఎఫ్టియు జిల్లా అధ్యక్షులు ఈదునూరి నరేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.అశోక్ తోకల రమేష్, ఐ.రాజేశం, కోట వెంకన్న, మాట్ల సమ్మయ్య, ఎన్.రాజేందర్,పులిపాక రాజేందర్, ఎర్రల సారయ్య, గుండ్ల పోశం, మంథని రాజు, వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, రామస్వామి, వేణు, శ్యామ్,సాయి,శివారెడ్డి, బాబురావు, రామాంజనేయులు,ఎం.లక్ష్మి,డి.లక్ష్మి,విజయలక్ష్మి,మధిర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# వికలాంగులకు ఫ్రీ బస్సు సౌకర్యాన్ని కల్పించాలి



**బోధన్, అక్టోబర్ 6 (జనంసాక్షి ) :**
కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం వికలాంగులకు ఉచిత బస్సు సౌకర్యాన్ని కల్పించాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి గైని రాములు, ఏశాల గంగాధర్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బోధన్ మండలం పెంటకుర్దు గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం లో వారు మాట్లాడుతూ, 2023 అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆర్టీసీ బస్సుల లో వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 34 నెలలు పూర్తి అవుతున్న హామిని అమలు చేయలేదని అన్నారు. ఇప్పటికే మహిళా వికలాంగులకు ఉచిత ప్రయాణ సౌకర్యం అమలులో ఉందని కేవలం పురుషులకు మాత్రమే అమలు చేయాల్సి ఉందని అన్నారు.జిల్లా స్థాయిలో డీలక్స్ బస్సుల్లో వికలాంగుల రాయితీ పాసులను అనుమతిస్తున్నా రని, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నడిచే ఎక్స్ప్రెస్, డీలక్స్ బస్సుల్లో మాత్రం వికలాంగుల పాసులను అనుమతించడం లేదని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఆర్డినరీ బస్సుల తక్కువ సంఖ్యలో తిరుగుతున్నాయని అలాంటప్పుడు వికలాంగులకు ఎలా ఉపయోగపడుతుందని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో నడిచే అన్ని రకాల బస్సుల్లో వికలాంగుల పాసులు అనుమతించాలని డిమాండ్ చేశారు.అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీ అమలు కోసం 34 నెలల నుండి వికలాంగులు ఆందోళన చేస్తున్న ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో వికలాంగులకు ఆర్టీసిలో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని ఇచ్చిన హామిని అమలు చేయాలని,గ్రేటర్ హైదరాబాద్పరిధిలో నడిచే అన్ని రకాల ఆర్టిసి బస్సుల్లో వికలాంగుల పాసులు అనుమతించాలని అక్టోబర్ 8న హైదరాబాద్ లోని బస్సు భవన్ ముందు జరిగే ధర్నాలో వికలాంగుల పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



## ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్

**మంథని, అక్టోబర్ 06,(జనంసాక్షి):**
పెద్దపల్లి జిల్లా మంథని మండలం అడవిసోమన్ పల్లి గ్రామంలో అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పంగ సంతోష్ మరణించగా మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిల్ల శీను బాబు ఆదేశాల మేరకు సంతోష్ పార్థివ మృతదేహానికి గ్రామ సర్పంచ్ గట్టు దామోదర్ గౌడ్ నివాళులు అర్పించారు. అనంతరం మూడు వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేసి వారి కుటుంబ సభ్యులను, పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. సర్పంచ్ వెంట మాజీ ఎంపీటీసీ గట్టు సత్యనారాయణ, వార్డ్ మెంబర్లు కనుకుట్ల నరేందర్, కడారి లక్ష్మీ బానయ్య పాల్గొన్నారు.

## బర్దిపూర్ పాఠశాలకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఘనంగా సన్మానించిన సర్పంచ్ అమూల్య మహేష్



**బోధన్, అక్టోబర్ 6 ( జనంసాక్షి ) :**
బోధన్ మండలం బర్దిపూర్ పాఠశాలకు చెందిన రాధ, వెంకటేశ్వర్లు జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం, అలాగే సందీప్ మండల స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం పట్ల గ్రామంలో హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బర్దిపూర్ గ్రామ సర్పంచ్ అమూల్య మహేష్ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించి, వారి సేవలను అభినందించారు. ఒకే పాఠశాలకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు వరుసగా జిల్లా స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకోవడం బర్దిపూర్ గ్రామానికి, పాఠశాలకు గర్వకారణం అని సర్పంచ్ అమూల్య మహేష్, గ్రామ పెద్దలు మరియు గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సద్గుణ, అంగన్వాడీ టీచర్ చంద్రకళ, గ్రామ పెద్దలు శ్రీనివాస్ రెడ్డి, సతీష్, కర్ణం, భూమయ్య, పోచయ్య మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పౌష్టికాహారం అందించడమే లక్ష్యం

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో.. మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్

**మంథని, అక్టోబర్ 06, (జనంసాక్షి):**
పెద్దపల్లి జిల్లా మంథని మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ జూనియర్ (బాలుర ) కళాశాలలో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మధ్యాహ్న భోజన పథకాన్ని మున్సిపల్ చైర్మన్ వోద్నాల శ్రీనివాస్, పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ వోద్నాల శ్రీనివాస్ ని, మున్సిపల్ పాలకవర్గ సభ్యులను కళాశాల యాజమాన్యం ముఖ్య అతిథులుగా ఆహ్వానించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ కోట ఉష, కళాశాల ఉపాధ్యాయ బృందం మున్సిపల్ చైర్మన్ వోద్నాల శ్రీనివాస్ ని శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ వోద్నాల శ్రీనివాస్ మాట్లాడుతూ.. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విద్యారంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. విద్యార్థులు మధ్యాహ్న భోజన పథకం ద్వారా పౌష్టికాహారం పొందుతూ, భోజనానికి సంబంధించిన ఇబ్బందులు లేకుండా తమ చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ పాలకవర్గ సభ్యులు మాచిడి రాజు గౌడ్, పెంటరి రాజు, ఎల్లెంకి వంశీధర్, నాయకులు జంబోజు సమ్మయ్య, ప్రభుత్వ జూనియర్ (బాలుర) కళాశాల



ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థిక అంశాలపై ఆన్‌లైన్ వెబినార్



**గంభీరావుపేట, అక్టోబర్ 6 (జనం సాక్షి):**
గంభీరావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కామర్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఆన్‌లైన్ వెబినార్ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ వి. విజయలక్ష్మి అధ్యక్షతన విభాగ ఇన్‌చార్జి మనోహర్, అధ్యాపకులు మహేష్, విజయల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.వెబినార్‌లో ముఖ్య వక్త గౌరీ గీత్ మాట్లాడుతూ ఆదాయంలో 40 శాతం ప్రాపర్టీపై, 10 శాతం బంగారంపై, 30 శాతం మ్యూచువల్ ఫండ్స్‌లో, 20 శాతం ఫిక్స్‌డ్ డిపాజిట్లలో పెట్టుబడి పెట్టే విధానాన్ని వివరించారు. రిటైర్మెంట్ ప్లానింగ్, దీర్ఘకాలిక, స్వల్పకాలిక పెట్టుబడులు, ఆర్థిక మోసాలపై అప్రమత్తత వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ప్రిన్సిపల్ విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యార్థులు ఆర్థిక విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరిస్తూ, ఆదాయాన్ని అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవడంతో పాటు పొదుపు అలవాటును పెంపొందించుకోవాలని సూచించారు.కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ప్రభాకర్, ఎన్ఎస్ఎస్ పీఓ పాక ధర్మపురి, టాస్క్ కోఆర్డినేటర్ డాక్టర్ జె. శ్రావణ్‌కుమార్, స్కాలర్‌షిప్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్. ఆదివిష్ణు, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ వి. వాణి, డాక్టర్ కె.వి. బిక్షమయ్య, సుచరణ్, శ్రీనివాస్, కృష్ణప్రసాద్, భార్గవి, దీపిక, శంకర్, ఆఖల్య తదితర అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలి

## ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా



**బోధన్, అక్టోబర్ 6 (జనంసాక్షి) :**
కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ లేకుంటే అధికారంలో ఉన్న కేంద్ర,రాష్ట్ర పాలకులకు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని సీ పీ ఐ (ఎం-ఎల్) మాస్ లైన్ పార్టీ నాయకులు హెచ్చరించారు. మంగళవారం నాడు బోధన్ పట్టణంలోని మహాలక్ష్మి మందిర్ కార్యాలయం నుండి సీ పీ ఐ (ఎం-ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) పార్టీ బోధన్ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో ర్యాలీగా షర్పుత్ కెనాల్, అంబేద్కర్ చౌరస్తా, రైల్వే గేట్, మున్సిపల్ కార్యాలయం ముందు నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్ళి ధర్నా చేసి డిమాండ్లతో కూడిన వినతి పత్రంతో పాటు ప్రజల వ్యక్తిగత దరఖాస్తు ఫారాలను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర సెక్రెటేరియట్ సభ్యులు ఎం. నరేందర్, జిల్లా సీనియర్ నాయకుడు కే గంగాధర్ లు మాట్లాడుతూ రేవంత్ రెడ్డి రాష్ట్ర శాసనసభకు జరిగిన ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని అర్హులైన వారందరికీ చేయూత పింఛన్లను ఇవ్వాలని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు నిత్యం వాడుకునే నిత్యావసర సరుకుల ధరలను నియంత్రించడంలో విఫ్లమవుతున్నారని పెరుగుతున్న ధరలను అరికట్టాలని రాష్ట్రంలో రైతాంగానికి నాణ్యమైన కోతలు లేని విద్యుత్తును సరఫరా చేయాలని, రైతులకు రుణమాఫీని పూర్తిగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల రాష్ట్ర ప్రజల ఆగ్రహానికి గురిగాక తప్పదని హెచ్చరించారు. డివిజన్ కార్యదర్శి డి రాజేశ్వర్ సహాయ కార్యదర్శి బి మల్లేష్ లు మాట్లాడుతూ, కార్మికుల వేతనాలు ఐదు సంవత్సరాలకు ఒకసారి పెంచకపోవడంతో పేద ప్రజలకు అమలు చేసే సంక్షేమ పథకాలు అమలు చేయకపోవడంతో సరుకుల ధరలు పెరిగి వారి కుటుంబాల మనుగడ చాలా కష్టంగా మారిందని మరోవైపు కార్మికులపై,ప్రజలపై పన్నుల భారాలను మోపి దేశ సంపదను కొద్ది మంది కార్పొరేట్ శక్తులకు దోచి పెట్టే విధానాలను రాష్ట్ర కేంద్ర,ప్రభుత్వాలు అనుసరిస్తున్నాయని ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలను వెంటనే మానుకోవాలని లేనిచో వీరికి ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ బోధన్ మండల కార్యదర్శి పడాల శంకర్ ప్రగతిశీల మహిళా సంఘం పట్టణ అధ్యక్షురాలు బి. నాగమణి,అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు జి. సీతారాం, ఒడ్డెన్న, ఎస్ కే నజీర్, జి.రాములు, దేవయ్య, బి.సాయిలు, గంగారాం, సలీం, మోహన్, డి.నాగేశ్వర్, నరేష్ మరియు వివిధ ప్రజా సంఘాల నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## పోషణ మాసం ప్రోగ్రాం అంగన్వాడి కేంద్రంలో జిల్లా అధికారి విజయలక్ష్మి



**ముస్తాబాద్ అక్టోబర్ 06 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండలం ఆవునూరు గ్రామంలో పోషణ మాసం ప్రోగ్రాం అంగన్వాడి కేంద్రంలో మహా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నక్క దాసరి రవి అధ్యక్షత వహించారు కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ లత అనూష ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా ఎస్సీ సెల్ వెల్ఫేర్ జిల్లా అధికారి ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ పిల్లల్లో గుర్తించి నువ్వు పోషణలతో ఉన్న పిల్లలకి పిహెచ్ఈ నందు మెడికల్ అసెస్మెంట్ చేయించాలని మరియు గర్భిణీగా ఉన్నప్పుడు సరి అయిన మోతాదులో పోషకాహారం తీసుకుంటే ఎనీమియా లోపం లేకుండా ఉంటుంది కావున అంగన్వాడికి వచ్చి సమతుల్ ఆహారం తీసుకోవాలని కిశోర బాలికలకు ఇళ్లలో పల్లీలు బెల్లము నువ్వులు లాంటి పదార్థాలను ఇచ్చినట్లయితే వారిలో కూడా హిమోగ్లోబిన్ పర్సెంట్ పెరుగుతుందని చెప్పడం జరిగింది, కార్యక్రమంలో ఇద్దరు తల్లులకి శ్రీమంతాలు చేయడం జరిగింది ఈ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్ నక్కల రాజు, కార్యదర్శి మల్లికార్జున్, అంగన్వాడీ టీచర్లు జై శాంత, బి బాలర్ శోభ, పి బాలలక్ష్మి, ఆశ వర్కర్లు వార్డ్ మెంబర్ , అధిక సంఖ్యలో తల్లులు హాజరు అయినారు.

## జాతీయ వన్యప్రాణి వారోత్సవాలు

**గంగాధర అక్టోబర్ 06( జనంసాక్షి ):**
జాతీయ వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా తెలంగాణ అటవీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం వెంకటాయపల్లి గ్రామంలో గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద అధికారులు వన్యప్రాణుల సంరక్షణ గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గంకిడి సంధ్య రామచంద్రారెడ్డి,అటవీ శాఖ డిప్యూటీ రేంజర్ ఎన్ బాపు రాజు,ఉపసర్పంచ్ ఎండి ఆసిఫ్, పంచాయతీకార్యదర్శి జయకర్ రెడ్డి, సెక్షన్ ఆఫీసర్ బి అనంతరామ్, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.






## పల్లె దవఖానకు మంగళవారం సెలవు

**ముస్తాబాద్ అక్టోబర్ 06 (జనం సాక్షి)**
కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామీణ ప్రాంతాలలో పల్లె దవఖాన ఏర్పాటు చేస్తే గ్రామీణ ప్రజలకు అందుబాటులో ఉండి సేవలు చేయాలని ఒక సంకల్పంతో ప్రభుత్వము పల్లె దవఖానులను ఏర్పాటు చేస్తే . ఓ పక్క మీటింగ్ ల పేరుతో పల్లె దవఖానకు తాళం వేశారు. పల్లె దవఖాన ఉంటుందని పేషెంట్లు బీపీ షుగర్ గోళీలు కావాలని దవఖనకుస్తే తాళం చూసి ఎనుకకు పోతున్న పేషెంట్లు ఈ విషయంపై ప్రభుత్వ డాక్టర్ గారిని వివరణ కోరగా ప్రతి మంగళవారం ఆఫీసులో మీటింగ్ ఉంటుంది అందుకే తాళం వేసి మీటింగ్ హాజరు కావడం జరిగింది. సమాధానం చెప్పారు డాక్టర్ ,పాల్గొన్నారు.

## మంత్రి శ్రీధర్ బాబు చొరవతోనే
## లద్నాపూర్ నిర్వాసితులకు న్యాయం..!

**సింగరేణి భూనిర్వాసితులకు ఎక్స్‌గ్రేషియా..శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం**

**గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వాసితులను మోసం చేసింది**

**మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్**



**రామగిరి, అక్టోబర్ 06, (జనంసాక్షి)**
సింగరేణి బొగ్గు గనుల కోసం తమ భూములు, ఇళ్లను త్యాగం చేసిన రామగిరి మండలం లద్నాపూర్ గ్రామ నిర్వాసితుల దశాబ్దాల కల ఎట్టకేలకు నెరవేరింది. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో గ్రామానికి చెందిన 283 కుటుంబాలకు పునరావాస పరిహారం (ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ) మంజూరైంది. మంత్రి కృషికి కృతజ్ఞతగా లద్నాపూర్ లోని శ్రీ గోదారంగనాయక స్వామి దేవాలయం వద్ద ఆయన చిత్రపటానికి గ్రామస్తులు, కాంగ్రెస్ శ్రేణులు ఘనంగా పాలాభిషేకం చేశారు. గ్రామ సర్పంచ్ వనం రామచంద్రరావు అధ్యక్షతన, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు తొగరి చంద్రయ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తొట్ల తిరుపతి యాదవ్ హాజరై పాలాభిషేకంలో పాలుపంచుకున్నారు. ఈ సందర్భంగా తొట్ల తిరుపతి యాదవ్ మాట్లాడుతూ గత ప్రభుత్వ వైఖరిపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "1986–88 ప్రాంతంలో సింగరేణి సంస్థ కోసం లద్నాపూర్ గ్రామస్తులు తమ భూములు, ఇళ్లను దారాదత్తం చేశారు. ఆనాడు ఎకరాకు కేవలం 9,000 నుంచి 10,000 రూపాయల చొప్పున నామమాత్రపు పరిహారం అందించి చేతులు దులుపుకున్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ అమలు, ప్లాట్ల కేటాయింపులో కాలయాపన చేసి ప్రజలను మోసం చేశాయి" అని ఆయన ఆరోపించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## అనారోగ్య బాధితులకు అండగా మంత్రి శ్రీధర్ బాబు

**మంథని, అక్టోబర్ 03,(జనంసాక్షి) :**
తెలంగాణ రాష్ట్ర ఐటి, పరిశ్రమల, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సీఎంఆర్ఎఫ్ ద్వారా మంథని నియోజకవర్గ పరిధిలోని మంథని మండలంలోని ఖాన్ సాయి పేట గ్రామానికి చెందిన కుంటాల వెంకటయ్య కు 2.00 లక్షల రూపాయల ఎల్ఓసి మంజూరు చేసి ఇప్పించారు. వెంకటయ్య నిమ్స్ ఆస్పత్రిలో అనారోగ్యంతో చేరి చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు కి తెలుపగా వెంటనే సీఎం సహాయ నిధి ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి 2.00 లక్షల మంజూరు చేయించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు సోమవారం వారికి ఎల్ఓసి మంజూరు కాపీని హైదరాబాద్ లో అందజేశారు. ఎల్ఓసి మంజూరు చేయించిన మంత్రి శ్రీధర్ బాబుకు సదరు బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

## కొండాయపల్లిలో భూభారతి రీ-సర్వే



**గంగాధర అక్టోబర్ 06 (జనంసాక్షి):**
మండలంలోని కొండాయపల్లి గ్రామంలో నేటి నుండి భూభారతి రీ సర్వే ప్రక్రియ మొదలవుతుందని గ్రామంలోని రైతులందరూ సంబంధిత సర్వే సిబ్బందికి అందుబాటులో ఉండాలని అవసరమైన సహకారం అందించాలని డిఐ గణపతి మరియు రమణ తెలిపారు,తమ భూములకు సంబంధించిన వివరాలు మరియు అవసరమైన పత్రాలతో సర్వేలో తప్పనిసరిగా పాల్గొని భూభారతి రీ–సర్వే ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి రైతులు సహకరించాలని కోరారు.

## జానకంపేట్ సొసైటీలో మృతుడి కుటుంబానికి రూ.2 లక్షల ఇన్సూరెన్స్



**ఎడపల్లి, అక్టోబర్ 6 ( జనంసాక్షి ) :**
నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల పరిధిలోని జానకంపేట్ సొసైటీలో రుణగ్రహీతగా ఉన్న చిక్కెల పోశెట్టి గత ఆరు నెలల క్రితం ప్రమాదవశాత్తు మృతి చెందారు. ఆయన జానకంపేట్ సొసైటీలో రుణం కలిగి ఉండటంతో జీపీఏ (జనతా పర్సనల్ యాక్సిడెంట్ ఇన్స్యూరెన్స్)కు సంబంధించిన డాక్యుమెంట్లు, రికార్డులను సేకరించి ఇన్స్యూరెన్స్ కంపెనీకి పంపించి బీమా మంజూరు కోసం సొసైటీ తరఫున ప్రయత్నాలు చేశారు. ఫలితంగా రూ. 2 లక్షల ఇన్స్యూరెన్స్ మంజూరు కాగా, అందుకు సంబంధించిన చెక్కును సొసైటీ చైర్మన్ మిద్దె నరేందర్ మృతుడి కుమారులు చిక్కెల రవి, చిక్కెల యోగేష్లకు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ మిద్దె నరేందర్ మాట్లాడుతూ, "చిక్కెల పోశెట్టి ప్రమాదవశాత్తు మృతి చెందడం బాధాకరం. ఆయన సొసైటీలో రుణం కలిగి ఉండటంతో జీపీఏ ఇన్స్యూరెన్స్‌కు సంబంధించిన అన్ని డాక్యుమెంట్లను ఇన్స్యూరెన్స్ కంపెనీకి పంపించి, బీమా మంజూరుకు సొసైటీ తరఫున ప్రయత్నించాం. ఫలితంగా రూ. 2 లక్షల ఇన్స్యూరెన్స్ మంజూరైంది. ఈ మొత్తాన్ని కుటుంబ అవసరాల కోసం సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నాం. బీమా మంజూరుకు సహకరించిన డీసీసీబీ చైర్మన్, సీఈఓ, ఇన్స్యూరెన్స్ కంపెనీ ప్రతినిధులు, డీసీసీబీ నవీపేట్ బ్రాంచ్ మేనేజర్‌కు ధన్యవాదాలు" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు గద్ద పెద్ద సాయన్న, బిళ్ల సాయిలు, సీఈఓ గంగారెడ్డి, సిబ్బంది ప్రవీణ్, నర్సయ్యతో పాటు పలువురు రైతులు పాల్గొన్నారు.

## రాణాపూర్ లో సద్దుల బతుకమ్మ ఏర్పాట్లు ముమ్మరం

**కమాన్ పూర్, అక్టోబర్ 06, (జనంసాక్షి) :**
సద్దుల బతుకమ్మ పండుగ ఏర్పాట్లలో భాగంగా రాణాపూర్ గ్రామ పెద్ద చెరువు కట్ట వద్ద శుభ్రం చేసి బతుకమ్మ ఘాట్ పనులను సర్పంచ్ ఇటుకల స్రవంతి ప్రారంభించారు. గ్రామంలో మహిళలు బతుకమ్మ వేడుకలు ఘనంగా జరుపుకునేందుకు వీలుగా చెరువు గట్టును జెసిబి సహాయంతో శుభ్రం చేయించి, ఘాట్ ను సిద్ధం చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బతుకమ్మ పండుగను ఘనంగా నిర్వహించేందుకు పంచాయతీ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట పంచాయతీ కార్యదర్శి అనిల్, ఫీల్డ్ అసిస్టెంట్ సంటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్టీసీ ఎన్నికల్లో ఐక్య కూటమిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలి

**ఇవి చరిత్రాత్మక ఎన్నికలుమోసపోతే గోసపడతాం**

**మెట్‌పల్లి డిపోలో విస్తృత ప్రచారం నిర్వహించిన ఏఐటీయూసీ అధ్యక్ష కార్యదర్శులు ఏశమేని గణేష్, ఎం.డి. ముక్రం**

**మెట్‌పల్లి, అక్టోబర్ 6(జనంసాక్షి)**
ఈ నెల 9న జరగనున్న టీజీఎస్ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల్లో ఈయూ, టీఎంయూ, ఎన్ఎంయూల జేఏసీ ఐక్య కూటమి అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని తెలంగాణ రాష్ట్ర ఏఐటీయూసీ కౌన్సిల్ మెంబర్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు ఏశమేని గణేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.డి. ముక్రం పిలుపునిచ్చారు.
ఎన్నికల ప్రచారంలో భాగంగా మెట్‌పల్లి ఆర్టీసీ డిపో ప్రాంగణంలో డిపో ఉద్యోగులు, డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ సిబ్బందిని నేరుగా కలిసి కరపత్రాలు పంపిణీ చేస్తూ ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోసపోతే గోసపడతాం అని ఆర్టీసీ కార్మికుల సంక్షేమం, ఉద్యోగ భద్రత, వేతన సవరణ, పి ఆర్ సి పదోన్నతులు సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఐక్య కూటమి నిరంతరం పోరాడుతోందని గుర్తుచేశారు. గతంలో కార్మిక హక్కుల సాధన కోసం జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన పోరాటాలను వివరిస్తూ, ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగ విరమణ వయస్సు 61 సంవత్సరాలకు పెంచేల



కృషి చేస్తామని రాబోయే రోజుల్లో యాజమాన్యం, ప్రభుత్వం నుంచి కార్మికులకు రావాల్సిన న్యాయమైన హక్కులను సాధించుకోవడానికి ఐక్య కూటమికి మద్దతు ఇవ్వడం చారిత్రక అవసరమని పేర్కొన్నారు. కార్మికుల క్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న ఈయూ?టీఎంయూ?ఎన్ఎంయూ జేఏసీ ఐక్య కూటమి బస్సు, నిచ్చెన గుర్తులపై ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఏశమేని గణేష్, ఎం.డి. ముక్రం విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో డిపో యూనియన్ అధ్యక్షుడు



మురళీధర్, సెక్రటరీ రాములు, నాయకులు, ప్రవీణ్, ఎంపీ రెడ్డి, ఏఐటీయూసీ ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.



## పోషకాహారంతోనే ఆరోగ్యకరమైన జీవనం

**దోశలగూడెం, కేజీ టు పీజీ అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాహా కార్యక్రమం**

**గంభీరావుపేట, అక్టోబర్ 6 (జనంసాక్షి):**
పోషణ మాసం, మంగళవారం 10 నిమిషాల కార్యక్రమంలో భాగంగా గంభీరావుపేట మండలం, కేజీ టు పీజీ తో పాటుదోశలగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మాహా కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ మల్లుగారి పద్మ నర్సగౌడ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జి. కళావతి మాట్లాడుతూ పిల్లల్లో పోషకాహార లోపాన్ని గుర్తించి పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేయించాలని సూచించారు. గర్భిణులు సమతుల్యమైన పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని తెలిపారు. కిశోర బాలికలకు పల్లీలు, బెల్లం, నువ్వులు వంటి పోషక పదార్థాలు అందించడం ద్వారా హిమోగ్లోబిన్ స్థాయిని మెరుగుపరచవచ్చని వివరించారు. అనంతరం ఇద్దరు తల్లులకు శ్రీమంతం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల హెచ్ఎం పరశురాములు, అంగన్‌వాడీ టీచర్లు నరాని సుజనా, ప్రశాంతి, రేఖ, శ్వేత, వార్డు సభ్యురాలు సుశాంతిక, తల్లులు పాల్గొన్నారు.

## ట్రాన్స్ఫారం పీస్ వైరు పోతుంది వ్యవసాయం మోటార్లు కాలుతున్నాయి

**ముస్తాబాద్ అక్టోబర్ 06 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండలం చిప్పలపల్లి గ్రామంలో గత 20 రోజుల నుండి ట్రాన్స్ఫారం ఫ్లీజ్ వేర్ ఒక్కరోజులో ఐదారు సార్ల ఫ్లీజ్ వేరు పోతుంది. హెల్పర్ గాని లైన్మెన్ గాని ఫోన్ చేస్తే అందుబాటులో ఉండడం లేదు గ్రామాలలో దీనివలన వ్యవసాయ పొలాలు ఎండిపోతున్నాయి పొట్ట కు అచ్చేదశలో వరి పొలాలు ఎండి పోతున్నాయి. పుట్టెడు కటం చేసి అప్పుల పాలై ఓ పక్క పొలాలు ఎండిపోతుంటే తలలు పట్టుకుంటున్నా రైతులు కొమ్మటి రాజమల్లు, కోమటి శ్రీనివాస్, చందన



నరసయ్య, కుంభం నర్సింలు గాడ్చుర్ల నరసింహులు గాడ్పేల్ అశోకు వారి పెల్లి కాశయ్య చందన ఎల్లయ్య, సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి ఉన్నప్పుడు కరెంటు సమస్య లేకుండా చూసుకున్నాడు ఏ సమస్య వచ్చినా ఫోను చేస్తేనే స్పందించి వెంటనే పరిష్కరించే నాయకుడు అంజిరెడ్డి , మళ్లీ సెస్ ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

## స్తంభంపల్లిలో ఘనంగా 'అంగన్ మిలాన్'

**బోయిన్‌పల్లి, అక్టోబర్ 06 (జనం సాక్షి)**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని నిర్వహిస్తున్న 'సేవా



సంకల్ప అభియాన్'లో భాగంగా మండలంలోని స్తంభంపల్లి గ్రామంలో 'అంగన్ మిలాన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బొంగాని అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకకు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే బొడిగ శోభ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు, ఆయాలను శాలువాలతో సత్కరించి, వారి సేవలను అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. చిన్నారుల ఆరోగ్యం, పౌష్టికాహారం, ప్రాథమిక విద్యతో పాటు గర్భిణులు, బాలింతల సంక్షేమంలో అంగన్‌వాడీ కేంద్రాల పాత్ర కీలకమైందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం మహిళలు, పిల్లల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, వాటి ఫలాలు అర్హులైన ప్రతి కుటుంబానికి అందేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా నాయకులు, కార్యకర్తలు సేవా కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు ఎడపల్లి పరశురామ్, బూరుగుపల్లి సర్పంచ్ పెంచాల సౌమ్య, స్తంభంపల్లి, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, నాయకులు నరసింహచారి, రవీందర్‌రెడ్డి, రాజేంద్రప్రసాద్, తిప్పర వేణు, శ్రీనివాస్, స్వామికుమార్, మారం ఉపేందర్, ఐలయ్య, వెంకటేష్, మహేష్, రజనీకాంత్, సాయికుమార్, అంగన్‌వాడీ సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## రుద్రంగి మండలంలో అంగన్వాడీ అవగాహన సభలు



**రుద్రంగి అక్టోబర్ 6 (జనం సాక్షి)**
జిల్లా కలెక్టర్ గారి ఆదేశాల మేరకు రుద్రంగి మండల కేంద్రంలో మంగళవారం అవగాహన సభలు నిర్వహించారు. మండల ప్రత్యేక అధికారి అధ్యక్షతన అడ్డబోర్ తండా,రూప్లా తండా, గైదిగుట్ట తండా,మానాల, రుద్రంగి అంగన్వాడీ కేంద్రాలలో ఈ సభలు జరిగాయి. ఈ సందర్భంగా అంగన్వాడీ లబ్ధిదారులకు అంగన్వాడీ సేవల ప్రాముఖ్యతను వివరించారు. మహిళలు,చిన్నారుల్లో లోప పోషణ, రక్తహీనత నివారణకు మహిళా శిశు సంక్షేమ శాఖ కృషి చేస్తుందని తెలిపారు. లోప పోషణ లేని సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని,లోప పోషణ ఉన్న పిల్లలను గుర్తించి ప్రత్యేక సూపర్వైజర్ ఫీడింగ్ అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి సంపత్, ఎంపీడీవో నటరాజ్, ఐసీడీఎస్ సూపర్వైజర్ మమత, పంచాయతీ కార్యదర్శి తిరుపతి, అంగన్వాడీ టీచర్లు పద్మ,జ్యోతి, శారద, కవిత, గంగామణి,మంజుల,సువర్ణ మరియు గర్భిణీలు, బాలింతలు, తల్లులు పాల్గొన్నారు.

## తాసిల్దార్ కార్యాలయంలో ఫైళ్ల కుప్పలు.. కోతుల హంగామా

**ముస్తాబాద్ అక్టోబర్ 06 (జనంసాక్షి)**
ముస్తాబాద్ మండల తహసీల్దార్ కార్యాలయంలో కట్టలు కట్టిన ఫైళ్లను స్టోర్ రూమ్‌లో భద్రపరచకుండా బాల్కనీలో ఉంచడంతో సమస్య తలెత్తింది. బాల్కనీలో ఉన్న ఫైళ్లపై కోతులు చేరి విచ్చలవిడిగా చిందులు వేస్తూ, ఫైళ్లను అస్తవ్యస్తం చేశాయి. దీంతో కీలకమైన ప్రభుత్వ రికార్డులు, ఫైల్స్ దెబ్బతినే అవకాశం ఉందని సిబ్బంది, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫైళ్లను భద్రంగా స్టోర్ రూమ్‌లోకి తరలించి, ప్రభుత్వ రికార్డుల పరిరక్షణకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



## వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించిన వైద్య బృందం

**రుద్రంగి అక్టోబర్ 6 (జనం సాక్షి)**
రుద్రంగి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ వసతి గృహంలో విద్యార్థినులకు పాదాలకు సంబంధించిన ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు జిల్లా కలెక్టర్ దృష్టికి వచ్చిన నేపథ్యంలో, వారి ఆదేశాల మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 343 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహించగా, 28 మంది విద్యార్థినులలో పాదాలకు సంబంధించిన సమస్యలు గుర్తించబడ్డాయి. జిల్లా కార్యక్రమ అధికారి వైద్యులు సంపత్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య బృందం విద్యార్థినులను పరీక్షించి అవసరమైన వారికి లక్షణాల ఆధారంగా చికిత్స అందించారు. అవసరమైన తదుపరి వైద్య సేవలు, తదుపరి పర్యవేక్షణపై సూచనలు చేశారు. ఈ సందర్భంగా వైద్యులు విద్యార్థినులకు వ్యక్తిగత పరిశుభ్రత, కాళ్లు, పాదాలను శుభ్రంగా ఉంచుకోవడం, పరిశుభ్రమైన దుస్తులు ధరించడం, ప్రతిరోజూ స్నానం చేయడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా మరుగుదొడ్లకు వెళ్లేటప్పుడు తప్పనిసరిగా పాదరక్షలు ధరించాలని, మరుగుదొడ్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విద్యార్థినులు తమకు కలిగే ఆరోగ్య సమస్యలను దాచకుండా వెంటనే వసతి గృహ సిబ్బందికి లేదా వైద్య సిబ్బందికి తెలియజేయాలని వైద్యులు సూచించారు. విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తూ అవసరమైన



వైద్య సేవలు అందించాలని సంబంధిత సిబ్బందికి సూచనలు చేశారు. ఈ వైద్య శిబిరంలో చిన్న పిల్లల వైద్య నిపుణులు రమణ, జిల్లా కార్యక్రమ అధికారి సంపత్ కుమార్, వైద్యాధికారులు ప్రభాకర్, అభినయ, కేజీబీవీ ప్రిన్సిపల్ వనిత, ఎంపీడీవో నటరాజ్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# కరెంట్ కోతలతో రైతుల గోసలు - గన్నేరువరం సబ్ స్టేషన్ వద్ద బీజేపీ నిరసన

**గన్నేరువరం, అక్టోబర్ 06 (జనంసాక్షి):** తక్కువ వర్షపాతం, మరోవైపు తరచూ విద్యుత్ అంతరాయాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీజేపీ గన్నేరువరం మండల అధ్యక్షులు తిప్పర్తి నికేష్ అన్నారు.వ్యవసాయానికి అవసరమైన సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు ఏర్పడటంతో రైతులు పంటలకు నీరు పెట్టలేక అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వ్యవసాయానికి నిరంతరంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని డిమాండ్ చేశారు. రైతుల విద్యుత్ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు భారతీయ జనతా పార్టీ గన్నేరువరం మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం గన్నేరువరం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ, కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి కరివెద మహిపాల్ రెడ్డి, మానకొండూరు నియోజకవర్గం అసెంబ్లీ కన్వీనర్ ముత్యాల జగన్ రెడ్డి, రాష్ట్ర మాజీ కౌన్సిల్ మెంబర్ విలాసారం రామచంద్రం, మండల ప్రధాన కార్యదర్శులు బొమ్మాడి సురేందర్ రెడ్డి, పుల్లెల రాము,బీజేవైఎం మండల అధ్యక్షులు మచ్చ సాయి కృష్ణ, ఉపాధ్యక్షులు గాలిపెల్లి శంకర్, కోశాధికారి బద్దం అనంత రెడ్డి, కార్యదర్శి చెక్కిళ్ల చంద్రయ్య,సీనియర్ నాయకులు బండి తిరుపతి, టేకు అనిల్,బుర్ర శ్రీను, చొక్కాల్లా లక్ష్మయ్య, గడ్డం రమణ రెడ్డి,మండల రైతులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.





## వైభవంగా మైలారం మల్లికార్జున స్వామి దివ్య దర్శనం, గిరి ప్రదక్షిణ

**గన్నేరువరం,అక్టోబర్ 06 (జనంసాక్షి):** మైలారం శ్రీ మల్లికార్జున స్వామి దేవస్థానంలో ఆలయ చైర్మన్ వరాల పరశురాములు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ సురేష్ ఆత్మారాం గురువు దివ్య దర్శన కార్యక్రమం అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామివారి దర్శనం అనంతరం భక్తులతో కలిసి గిరి ప్రదక్షిణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి దర్శనం చేసుకొని గురువుగారి ఆశీస్సులు పొందారు. ఓం నమః శివాయ నామస్మరణతో మైలారం గిరులు మారుమోగాయని, గిరి ప్రదక్షిణలో పాల్గొన్న భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేసినట్లు చైర్మన్ వరాల పరశురాములు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.




## ప్యాక్స్ చైర్మన్ వెంకటికి ఘన సన్మానం

**గంభీరావుపేట అక్టోబర్ 6 జనంసాక్షి;** గంభీరావుపేట ప్యాక్స్ చైర్మన్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వేషాల వెంకటిని మల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన మున్నూరు కాపు (బీ) సంఘం సభ్యులు ఘనంగా సన్మానించారు. ప్యాక్స్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో వెంకటికి శాలువా కప్పి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు ఆయనకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు జక్కు శ్రీనివాస్, మాజీ మండల అధ్యక్షుడు హమీద్, సభ్యులు కముటం వెంకట్‌స్వామి, ఆకుల సత్తయ్య, రాజామలయ్య, ఉప్పు అరుణ్‌కుమార్, కంటం బాలరాములు, జక్కు తిరుపతి, కాస రాజశేఖర్, గాంధ్యడపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.



## అంగన్వాడీ సిబ్బందికి ఘన సన్మానం

**ఇల్లంతకుంట, అక్టోబర్ 6 (జనంసాక్షి):** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదిన వేడుకల్లో భాగంగా ఆయన 25 సంవత్సరాల సేవా కార్యక్రమాలను పురస్కరించుకుని ఇల్లంతకుంట మండల ప్రధాన కార్యదర్శి కరికె నవీన్ కుమార్ ఆధ్వర్యంలో పెద్దలింగాపూర్, రామోజీపేట గ్రామాల్లోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలను ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు, బాలింతలకు అందిస్తున్న సేవలను గుర్తించి సిబ్బందిని అభినందించారు. రామోజీపేటకు చెందిన అంగన్వాడీ టీచర్లు మాసం సునీతాదేవి, ల్యాగల రమాదేవి, కేతిరెడ్డి కళ్యాణి, పసుల అంజలితో పాటు ఆయాలు పసుల మధుమతి, మొలంకుల సత్తవ్వ, ల్యాగల మమతలను సత్కరించారు. కరికె నవీన్ కుమార్ మాట్లాడుతూ అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పసి పిల్లలు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవలు విలువకట్టలేనివని అన్నారు. దేశ సేవలో 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అంగన్వాడీ సిబ్బందిని సన్మానించడం ఆనందంగా ఉందన్నారు.కార్యక్రమంలో మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు మారవేని దివ్యరాజు, మండల నాయకులు అమ్ముల అశోక్, సీనియర్ నాయకులు దండవేణి రజనీకాంత్, మండల నాయకురాలు అల్వాల భారతి, బూత్ అధ్యక్షులు గాదె మధు, కీర్తి రాజుతో పాటు మహిళలు, తల్లులు, పిల్లలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అంగన్ మిలాన్ సేవా కార్యక్రమం

**ఇల్లంతకుంట, అక్టోబర్ 6 (జనంసాక్షి):** ఇల్లంతకుంట మండలం వెల్జిపూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సేవా సంకల్ప అభియాన్‌లో భాగంగా అంగన్ మిలాన్ సేవా కార్యక్రమాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించిన నాయకులు అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలను సన్మానించి, వారు అందిస్తున్న సేవలను అభినందించారు. చిన్నారులకు అందుతున్న పోషకాహారం, కేంద్రం ద్వారా నిర్వహిస్తున్న కార్యక్రమాలను పరిశీలించారు. అలాగే తల్లిదండ్రులకు కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు దేశెట్టి శ్రీనివాస్, మండల దళిత మోర్చా అధ్యక్షుడు కొమ్ము హరికృష్ణ, మండల కార్యవర్గ సభ్యుడు చిట్యాల శ్రీనివాస్, బూత్ అధ్యక్షుడు బుట్టి మోహన్ తదితరులు పాల్గొన్నారు.





## బతుకమ్మ నిమర్జన ఘాట్ పనులను పరిశీలించిన: ఆర్.జి త్రీ జీఎం

**రామగిరి జనం సాక్షి (అక్టోబర్ 6):** బతుకమ్మ పండుగను పురస్కరించుకొని మహిళలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిమజ్జన ఘాట్ వద్ద అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక సోలార్ కంట్రోల్ కార్యాలయం వద్ద గల బొక్కల వాగు వద్ద ఏర్పాటు చేస్తున్న, బతుకమ్మ నిమర్జన ఘాట్ పనులను ఆయన పరిశీలించారు. నిమజ్జనానికి వచ్చే మహిళలు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సౌకర్యాలను కల్పించాలని సూచించారు. ఘాట్ పరిసరాల్లో పారిశుధ్య నిర్వహణ, తాగునీటి సౌకర్యం, విద్యుత్ దీపాల ఏర్పాటు, భద్రతా చర్యలు తదితర అంశాలపై అధికారులతో సమీక్షించారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం.రామచంద్ర రెడ్డి, బెల్లం శ్రీనివాస్, ఎస్వోటుజియం యం.రామ్మోహన్, డి జి ఎం ఎస్.రవి కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, సంబంధిత అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి సంస్థ పెద్దపీట : అర్జీ త్రీ జి.యం

### నూతన తాగునీటి పైపు లైన్ పనులకు భూమిపూజ

**రామగిరి జనం సాక్షి (అక్టోబర్ 06):** ఉద్యోగుల సంక్షేమానికి సింగరేణి సంస్థ పెద్దపీట వేస్తుందని రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ అన్నారు.సెంటినరీ కాలనీ వాసుల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని, సుమారు 07 కోట్ల తో, పోతన కాలనీ ఫిల్టర్ బెడ్ నుండి సెంటినరీ కాలనీ ఫిల్టర్ బెడ్ వరకు సుమారు 8.2 కిలోమీటర్ల నూతన తాగునీటి పైపు లైన్ పనులకు మంగళవారం స్థానిక సోలార్ మెయిన్ కంట్రోల్ కార్యాలయ సమీపంలో రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్ భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉన్న పైప్ లైన్ వేసి చాలా కాలమైనందున తరచూ మరమ్మత్తులు రావడంతో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని, అందుచేత నూతన పైప్ లైన్ ఏర్పాటు చేస్తున్నామని, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం నిరంతరం కృషి చేస్తోందన్నారు.కాలనీలో తాగునీటి సరఫరాను మరింత మెరుగు పరిచేందుకు నూతన పైపు లైన్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులో పూర్తి చేసి కాలనీ వాసులకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సింగరేణి సంస్థ ఉద్యోగుల సంక్షేమం తో పాటు వారి కుటుంబాల సౌకర్యాలకు కూడా అధిక ప్రాధాన్యత ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. తాగునీరు, రహదారులు, పారిశుధ్యం తదితర మౌలిక వసతుల అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాల నాయకులు యం. రామచంద్ర రెడ్డి, బెల్లం శ్రీనివాస్, ఎస్వోటుజియం యం. రామ్మోహన్, సివిల్ డిజియం ఎస్.రవి కుమార్, పర్సనల్ విభాగాధిపతి బి.సుదర్శనం, అధికారులు మనోజ్ కుమార్, డి.శ్రీనివాస్, కాంట్రాక్టర్ మాధవరావు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



# అసైన్డ్ భూములకు యజమాని హక్కులు కల్పించాలి

## తహసీల్దార్‌కు ఎమ్మార్పీఎస్ నాయకుల వినతి

**నిజాంసాగర్, అక్టోబర్ 6 (జనంసాక్షి):** నిజాంసాగర్ మండలంలోని వివిధ గ్రామాలు, పరిసర ప్రాంతాల్లో ఉన్న అసైన్డ్ భూములకు అర్హులైన లబ్ధిదారులకు యజమాని హక్కులు కల్పించాలని కోరుతూ కామారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు సర్వగల రవీందర్ మాదిగ ఆధ్వర్యంలో మంగళవారం నిజాంసాగర్ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ.. ఎన్నో ఏళ్లుగా అసైన్డ్ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న అర్హులైన పేదలకు ప్రభుత్వం యజమాని హక్కులు కల్పించి, వారి భూములకు పూర్తి హక్కులు కల్పించాలని కోరారు. ఈ విషయాన్ని ఎమ్మార్వో ద్వారా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, ప్రభుత్వం నుంచి తగిన నిర్ణయం వచ్చేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. వినతిపత్రాన్ని స్వీకరించిన తహసీల్దార్ సానుకూలంగా స్పందిస్తూ.. సమస్యను ప్రభుత్వ ఉన్నతాధికారుల



దృష్టికి తీసుకెళ్లి, తన పరిధిలో సాధ్యమైనంత వరకు న్యాయం జరిగేలా కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంసాగర్ మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు, మాజీ సర్పంచ్ పి. సాయిలు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సంబపూర్ రవి, జిల్లా యువసేన అధ్యక్షులు రాజు, జిల్లా యువసేన ప్రచార కార్యదర్శి రవికుమార్, మండల గౌరవ అధ్యక్షులు పరువయ్య, జిల్లా కార్యదర్శి రాములు, కోడ్పగల్ మండల ఉపాధ్యక్షులు ఎర్రల్లో శ్రీమన్, అంబేద్కర్ ఉపాధ్యక్షులు జంజీర్ దుర్గయ్యతో పాటు సాయిలు, ఎమ్మార్పీఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వం ఓట్లను తొలగించే కుట్ర పన్నుతుంది

**ఓటు బచావో, దేశ్ బచావో.,**
**కాంగ్రెస్ పార్టీ వామపక్షాలతో భారీ నిరసన ర్యాలీ..**




**సిరిసిల్ల టౌన్ అక్టోబర్ 6 (జనం సాక్షి)** సర్ పేరిట దేశవ్యాప్తంగా ఓట్లను తొలగించే కుట్ర కేంద్ర ప్రభుత్వం పన్నుతుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ వామపక్షాల నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటును కాపాడండి,దేశాన్ని కాపాడండి అంటూ అఖిల భారత కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి ఆధ్వర్యంలో సిరిసిల్లలో భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఓటు చోరీకి పాల్పడుతున్న ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు.ఏఐసిసి పిలుపుమేరకు సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇండియా కూటమి ఆధ్వర్యంలో ఓటు బచావోదేశ్ బచావో కార్యక్రమంలో భాగంగా సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయం నుండి గాంధీ చౌక్ వరకు భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ నాయకులతో పాటు సిపిఐ, సిపిఎం, తెలంగాణ జన సమితి నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆర్డీవో కార్యాలయం ముందు గాంధీ చౌక్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి అక్కడ జాతీయ గీతాన్ని ఆలాపించి దేశంలోని పౌరుల ఓట్లను కొల్లగొడుతున్న ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్వర్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ మాట్లాడుతూ.సర్ పేరిట దేశవ్యాప్తంగా 13 కోట్ల ఓటర్లను తొలగించే కుట్ర కేంద్ర ప్రభుత్వం చేస్తుందని ఆరోపించారు. చీఫ్ ఎన్నికల అధికారి జ్ఞానేశ్వర్ ను వెంటనే పదవి నుండి తప్పించాలని, లేకపోతే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా బిజెపియేతర రాష్ట్రాలలో ఓటర్లను తొలగిస్తున్నారని అన్నారు. తెలంగాణలో కూడా బిజెపి హస్తగతం చేసుకునేలా ఓట్లను తొలగిస్తుందని అన్నారు. ఒక సిరిసిల్ల జిల్లాలోని 40,000 ఓట్లను తొలగించారని ఆరోపించారు. ఈ భారత దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండాలని ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని ఇప్పటికైనా బిజెపి ఎన్నికల చీఫ్ ఆఫీసర్ జ్ఞానేశ్వర్ పదవి నుండి తప్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు గుంటి వేణు, పంతం రవి, కడారి రాములు, సిపిఎం నాయకులు మూశం రమేష్, కోడం రమణ, విమల, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు సూర దేవరాజు, గడ్డం నరసయ్య, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఆకునూరి బాలరాజు, బోప్ప దేవయ్య, కల్లూరి చందన తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాస్థాయి అథ్లెటిక్ , స్పోర్ట్స్ విభాగాల్లో తమ సత్తా చాటిన సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు

**చొప్పదండి ,అక్టోబర్ 6 (జనం సాక్షి):** కరీంనగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి ఖో ఖో,కబడ్డీ మరియు అథ్లెటిక్స్ పోటీలలో చొప్పదండి మండలం సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నుండి వివిధ విభాగాలలో విద్యార్థులు పాల్గొని తమ అద్భుత ప్రతిభ కనబరిచి వివిధ పతకాలు సాధించినట్లు సిద్ధార్థ విద్యాసంస్థల చైర్మన్ దాసరి శ్రీపాల్ రెడ్డి పేర్కొన్నారు.అండర్?17 విభాగంలో కబడ్డీ పోటీలలో ఓ .మహేష్ బంగారు పతకం, వాలీబాల్ పోటీలలో ఏ. జశ్వంత్ బంగారు పతకం, కోకో పోటీలలో పి లయ వర్ధన్ వెండి పథకం, అథ్లెటిక్స్లో పి .లయ వర్ధన్ కాంస్య పథకం, అండర్?14 విభాగంలో షార్ట్ పుట్ లో వై మృదుల్, కబడ్డీలో కే సూర్య కాంస్య పథకం, కొక్కోలో ఎం విశ్వ బంగారు పథకం లు సాధించి జోనల్ స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు ఆయన పేర్కొన్నారు.విద్యార్థులు భవిష్యత్తులో




మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తమ పాఠశాల చదువుతో పాటు, విద్యార్థుల సమగ్రాభివృద్ధికై ఎల్లవేళలాపాటుపడుతుందని తెలిపారు.



# ఖిల్లా రామాలయానికి రోప్‌వే

**పర్వతమాల పథకం అమలుకు కదిలిన యంత్రాంగం..**

**అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రతిపాదనకు సానుకూల స్పందన..**

**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 జనంసాక్షి:** చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఇందూరు ఖిల్లా రామాలయాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అడుగులు వేగవంతమయ్యాయి. అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రతిపాదనతో ఖిల్లా రామాలయానికి పర్వతమాల పథకం కింద రోప్‌వే ఏర్పాటు చేసే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం కదిలింది. ఇందులో భాగంగా మంగళవారం రోడ్లు భవనాల శాఖ అధికారులు, ప్రముఖ రోప్‌వే సంస్థ ప్రతినిధులు ఖిల్లా రామాలయ పరిసరాలను పరిశీలించారు.ఖిల్లా రామాలయ అభివృద్ధిపై ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పలుమార్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లారు. ఇటీవల కేంద్ర మంత్రులు నితిన్ గడ్కరీ, గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి ఖిల్లా రామాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు పర్వతమాల పథకం కింద సుమారు రూ.180 కోట్లతో రోప్‌వే, ఇతర అభివృద్ధి పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిలను కూడా కలిసి ప్రతిపాదనలను వివరించారు.ఎమ్మెల్యే ప్రతిపాదనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి సానుకూల స్పందన లభించడంతో తాజాగా క్షేత్రస్థాయిలో పరిశీలన ప్రారంభమైంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రోడ్లు భవనాల శాఖ అధికారులు ఖిల్లా రామాలయాన్ని సందర్శించి రోప్‌వే ఏర్పాటుకు అనువైన ప్రాంతాలను పరిశీలించారు.

**పరిసరాలను పరిశీలించిన రోప్‌వే సంస్థ ప్రతినిధులు.**

దేశంలో ప్రముఖ రోప్‌వే సంస్థగా పేరున్న సీఆర్‌ఎస్ ప్రతినిధులు ఆలయ పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఖిల్లా నిర్మాణం, భౌగోళిక పరిస్థితులు, రోప్‌వే ఏర్పాటుకు అనువైన ప్రాంతాలు, ప్రయాణ మార్గం తదితర అంశాలను పరిశీలించినట్లు తెలిపారు. త్వరలోనే సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేయనున్నట్లు వెల్లడించారు. పరిసరాలకు అనుగుణంగా మోనో కేబుల్, బై కేబుల్, జిగ్‌జాగ్, ట్రై కేబుల్ తదితర రోప్‌వే విధానాలను పరిశీలించి, అందులో అనువైన నమూనాను డీపీఆర్‌లో పొందుపరచనున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ డీఈ మోహన్, సీఆర్‌ఎస్ రోప్‌వే సంస్థ ప్రతినిధి తన్మయ్ రాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు

**కరీంనగర్, క్రైమ్ అక్టోబర్ 6 ( జనంసాక్షి ) :** లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ ఆధ్వర్యంలో ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను సోమవారం కరీంనగర్‌లోని మానేర్ బి.ఎడ్ కళాశాలలో ఘనంగా




నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను, సమాజ నిర్మాణంలో వారి పాత్రను కొనియాడుతూ కళాశాల అధ్యాపకులను సత్కరించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు కేవలం విద్యను అందించడమే కాకుండా, వారి వ్యక్తిత్వ వికాసానికి, భవిష్యత్ నిర్మాణానికి మార్గదర్శకులుగా నిలుస్తున్నారని కార్యక్రమంలో పేర్కొన్నారు.కార్యక్రమంలో భాగంగా బి.ఎడ్ విద్యార్థులకు వ్యాసరచన పోటీ నిర్వహించి, విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.అదేవిధంగా మానేర్ విద్యాసంస్థల చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టిక్ సంచుల వినియోగాన్ని తగ్గించేందుకు కళాశాల సిబ్బందికి క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కరీంనగర్ అధ్యక్షుడు మ్యాడం శివకాంత్ పటేల్, కార్యదర్శి బట్టు వినోద్ పటేల్, కోశాధికారి మెతుకు కె. చైతన్య సీనియర్ సభ్యుడు సింగమరాజు వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు. కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొని ప్రపంచ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను విజయవంతం చేశారు.



# 24 గంటల్లో తాగునీటి సరఫరా పునరుద్ధరించాలి

## గడి వాటర్ ట్యాంక్ మోటార్ల మరమ్మతులపై చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ ఆదేశాలు



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 6 (జనంసాక్షి)** కామారెడ్డి మున్సిపాలిటీ జోన్?1 పరిధిలోని గడి వాటర్ ట్యాంక్ మోటార్లు పాడై గత కొన్ని రోజులుగా తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడటంపై మున్సిపల్ పాలకవర్గం తీవ్రంగా స్పందించింది. ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మోటార్ల మరమ్మతులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి, రాబోయే 24 గంటల్లో మంచినీటి సరఫరాను పునరుద్ధరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. జోన్?1 పరిధిలోని 25, 26, 27, 28, 30, 44, 45, 46, 47 వార్డుల్లో గడి వాటర్ ట్యాంక్ మోటార్లు పనిచేయకపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని కౌన్సిలర్లు, స్థానికులు మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ అధికారులతో కలిసి పరిస్థితిని సమీక్షించి, సమస్యను వెంటనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ తాగునీరు ప్రజల ప్రాథమిక అవసరమని, మోటార్లు కాలిపోయిన విషయాన్ని ముందుగానే అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ సకాలంలో స్పందించక పోవడం, మరమ్మతుల్లో జాప్యం జరగడాన్ని తీవ్రంగా ఖండించారు. ఇంజినీరింగ్, వాటర్ వర్క్స్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య తీవ్రతను పరిశీలించి, ఎలాంటి జాప్యం లేకుండా పరిష్కార చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మున్సిపల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఎంఈ, ఏఈలు వెంటనే రంగంలోకి దిగి పాడైన సంపు మోటార్లకు మరమ్మతులు పూర్తి చేయాలని సూచించారు. మరమ్మతులు పూర్తయ్యే వరకు ప్రభావిత వార్డుల్లో ప్రజలకు తాగునీటి కొరత ఏర్పడకుండా ప్రత్యామ్నాయంగా నీటి ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.ఇకపై తరచూ సంపు మోటార్లు కాలిపోకుండా శాశ్వత పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని చైర్‌పర్సన్ సూచించారు. అవసరమైన చోట బయట బిగించే ఇండక్షన్ మోటార్లను ఏర్పాటు చేయడంతో పాటు, స్టాండ్‌బై మోటార్లను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.ప్రజలకు తాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తక్షణమే పనులు పూర్తి చేసి, 24 గంటల్లో సరఫరాను సాధారణ స్థితికి తీసుకువస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు బబ్బు, పిట్ల వేణు, గేరిగంటి లక్ష్మీనారాయణ, లక్ష్మణ్, నర్సింలు, అరవింద్, మధు, మున్సిపల్ డీఈ హన్మాంతరావు, ఏఈ వేణు ప్రసాద్, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# అహ్మద్ బి.ఎడ్ కళాశాలలో బతుకమ్మ సంబరాలు



**భిక్కనూర్ అక్టోబర్ 06 (జనంసాక్షి):** భిక్కనూరు మండల కేంద్రానికి సమీపంలో గల అహ్మద్ బి.ఎడ్ కళాశాలలో మంగళవారం తెలంగాణ సాంప్రదాయాల పండగ బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థినిలు ఉపాధ్యాయులు అధ్యాపకులు సాంప్రదాయ వస్త్రధారణలో ఈవేడుకల్లో పాల్గొని రంగురంగుల పుష్పాలతో అందంగా బతుకమ్మలను పేర్చి బతుకమ్మ పాటలు పాడుతూ సాంప్రదాయాలు నృత్యాలతో సందడిచేస్తూ కళాశాల ప్రాంగణం పండగ వాతావరణంతో కళకళలాడింది. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎండి హనీ పాషా మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి సంప్రదాయాల ఆడపడుచుల అతిపెద్ద పండగ బతుకమ్మపండుగ అని ఈపండగ భావి తరాలకు చేరవేయడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థినిలు విద్యబోధనకు పరిమితం కాకుండా మన వారసత్వ పండగ సాంప్రదాయాల విలువలను భావితరాలకు పరిచయం చేయడం ఎంతో అవసరం అన్నారు. ఈకార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఆసం కల్పన,బొండుగుల అర్చన, విద్యార్థినిలు కళాశాల సిబ్బంది పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరం

### జిల్లా సంక్షేమ శాఖ ఇంచార్జ్ పిడి సౌందర్య



**ఎడపల్లి, అక్టోబర్ 6 ( జనంసాక్షి )** తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని పుట్టిన బిడ్డకు వెంటనే ముర్రుపాలు తాగించాలని జిల్లా సంక్షేమ శాఖ ఇంచార్జ్ అధికారిని సౌందర్య స్పష్టం చేశారు. మంగళవారం ఎడపల్లి మండలం జానకంపేట సెక్టార్ పరిధిలోని జానకంపేట గ్రామంలో 9వ పోషణ మాసోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి పీడీ సౌందర్య మాట్లాడుతూ, పోషణలోపంకు గురి కాకుండా ఆరోగ్యవంతమైన చిన్నారులు జన్మించేందుకు అంగన్వాడి కేంద్రాల్లో అందించే పౌష్టికాహారాన్ని ప్రతి ఒక్కరు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ కేంద్రాలలో రికార్డులను మెయింటైన్ చేయడంతో పాటు కేంద్రాలను పరిశుభ్రత ఉంచుకోవాలని చిన్నారులకు మంచి పౌష్టికాహారాన్ని అందించాలని ఆమె ఆదేశించారు. అనంతరం సామూహిక సీమంతాలను నిర్వహించడంతో పాటు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జాన్కంపేట్ సర్పంచ్ సుంచనకోట అనురాధ రాధా కిషన్ గౌడ్, ఉపసర్పంచ్ నీలం కృష్ణ, వార్డ్ మెంబర్ చిట్టి, ఇంచార్జ్ సిడిపిఓ నందిని, ఎడపల్లి మండల సూపర్వైజర్ సావిత్రి, సూపర్వైజర్లు ఆసియా, కొమురవ్వ, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ రాంబాబు, అంగన్వాడి టీచర్లు, గర్భిణీలు, మహిళలు పాల్గొన్నారు.



# పెద్దకొడప్గల్ లో పర్యటించిన జడ్పీ సీఈవో

**పెద్ద కొడప్గల్ అక్టోబర్ 06 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (జడ్పీ సీఈవో) చందర్ నాయక్ మంగళవారం పెద్ద కొడప్గల్ మండలంలో పర్యటించారు. నూతనంగా చేయూత పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల అర్హతలను క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న దివ్యాంగుల కుటుంబ, ఆర్థిక పరిస్థితులను, వారి వైకల్య స్థితిగతులను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా వితంతువులు, ఒంటరి మహిళలతో మాట్లాడి వారి కుటుంబ పరిస్థితులు, ఆర్థిక స్థితిగతులు, జీవన పరిస్థితులపై వివరాలు సేకరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు పారదర్శకంగా అందేలా క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బిఆర్ అభినవ్ చందర్, ఎంపీఓ లక్ష్మీకాంత్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు గీత, శివాజీ, తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వ కొలతల ప్రకారమే నిర్మించుకోవాలి: ఏఈ



**పెద్ద కొడప్గల్ అక్టోబర్ 06 (జనంసాక్షి):** ప్రభుత్వం సూచించిన కొలతల ప్రకారమే ఇందిరమ్మ ఇళ్లను నిర్మించుకోవాలని హౌసింగ్ ఏఈ జ్యోతి సూచించారు. మంగళవారం సర్దార్ తండాలో పంచాయతీ కార్యదర్శి సాయిలు తో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాలు నిర్దేశిత నాణ్యతా ప్రమాణాలతో వేగంగా పూర్తి చేసుకోవాలని లబ్ధిదారులకు తగు సూచనలు చేశారు. నిర్మాణ సమయంలో సందేహాలు ఉంటే తమను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు ఉన్నారు.

# పంచాయతీ కార్యదర్శి ఐడియా అదుర్స్..

## మొక్కలు నాటాలని చాలెంజ్



**పెద్ద కొడప్గల్ అక్టోబర్ 06 (జనంసాక్షి):** పెద్ద కొడప్గల్ మండలంలోని కాస్లాబాద్ గ్రామ పంచాయతీ కార్యదర్శి శివాజీ మొక్కలు నాటేలా వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. తాను మొక్కలు నాటి, 21 మంది మిత్రులకు సోషల్ మీడియా ద్వారా మొక్కలు నాటాలని చాలెంజ్ విసిరారు. ఆయన ఆలోచనకు స్పందించిన మిత్రులు, ఉద్యోగులు చాలెంజ్‌ను స్వీకరించి మొక్కలు నాటుతున్నారు. మంగళవారం ఎంఈఓ ప్రవీణ్ కుమార్ మొక్కలు నాటే కార్యక్రమంలో భాగస్వామ్యమయ్యారు. పంచాయతీ కార్యదర్శి శివాజీని అభినందిస్తూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పరిరక్షించాలని సూచించారు.

# దసరా,బతుకమ్మ పండగ వేల షాపింగుకు వెళ్లేవారు అప్రమత్తంగా ఉండాలి

## దొంగతనాల నివారణకు ప్రజలు జాగ్రత్తలు పాటించాలి : సిఐ జగదం నరేష్




**భిక్కనూరు అక్టోబర్ 06 (జనంసాక్షి):** భిక్కనూరు మండలం కేంద్రంలో గల భిక్కనూరు సర్కిల్ కార్యాలయంలో సిఐ.జగదం నరేష్ పత్రిక సమావేశంలో మాట్లాడుతూ బతుకమ్మ, దసరా పండగ సందర్భంగా ప్రజలు పెద్ద సంఖ్యలో వివిధ ప్రాంతాలకు షాపింగ్, మార్కెటింగ్ కు బస్సు, ద్విచక్ర వాహనంతో ప్రయాణంలో ఇతర రద్దీ ప్రాంతాలకు వెళ్లే సమయంలో ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని భిక్కనూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ జగదం నరేష్ ప్రజలకు సూచించారు. పండగను ఆనందంగా ప్రశాంత వాతావరణంతో జరుపుకోవడంతో పాటు తమ ఆస్తులు మొబైల్ ఫోన్లు,నగదు, బంగారు ఆభరణాలను జాగ్రత్తగా భద్రపరుచుకోవాలని.అదేవిధంగా బైకులు ఇతర వాహనాలను తప్పనిసరిగా లాక్ చేసి సురక్షితమైన ప్రదేశంలో పార్కింగ్ చేయాలని సూచించారు, అదేవిధంగా పండగ సమయం వేళలో ఇంటికి తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో తాము ఊరికి వెళ్తున్నట్లు ఇల్లు ఖాళీగా ఉన్నట్లు సోషల్ మీడియాలో బహిరంగంగా పోస్టులు చేయవద్దని సూచించారు. వ్యక్తిగత భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అదేవిధంగా రద్దీ ప్రాంతాల్లో అపరిచిత వ్యక్తులు అనుమానస్పదంగా వ్యవహరించినా వాహనాలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఏదైనా వస్తువు పోయినా, దొంగతనం జరిగినా ఆలస్యం చేయకుండా సమీపంలోని పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని కోరారు. అప్రమత్తమే మనకు రక్షణ ప్రజల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుంది. ప్రజలు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించి బతుకమ్మ, దసరా పండగను సురక్షితంగా ఆనందంగా జరుపుకోవాలని సీఐ జగదం నరేష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.